# కల్వరి ప్రేమధార

(ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక)




సెప్టెంబర్-అక్టోబర్ ౨౦౨౦

విడి ప్రతి వెల రూ.౨౦/-

ఎడిటర్:

డా: యన్. జయపాల్



# ఇప్పుడు ప్రతిరోజు
# Dr Jayapaul YouTube ఛానల్‌లో
# ప్రసారమవుతున్న కార్యక్రమాలు వీక్షిస్తున్నారా?




ప్రతిరోజు ఉదయం 7:00 గం॥లకు
కీర్తనల గ్రంథ ధ్యానం




ప్రతిరోజు మధ్యాహ్నం 3:00 గం॥లకు
బైబిల్‌లో నుండి ఒక హెచ్చరిక




ప్రతిరోజు రాత్రి 9:00 గం॥లకు
ఒక క్రొత్త అంశముతో




ప్రతిరోజు అర్ధరాత్రి 12:00 గం॥లకు
ప్రత్యేక వర్తమానములు

మరియు మరనేక పాటలు, క్లుప్త వర్తమానములు కూడా వీక్షించవచ్చు!

**Dr Jayapaul - Youtube, Facebook, Instagram, Twitter** లలో Subscribe చేసుకొనండి!

# కల్వరి ప్రేమధార

ఎడిటర్: యన్. జయపాల్ సెప్టెంబరు - అక్టోబరు 2020

కల్వరి 36 {ఈ పత్రిక ఉచితం కాదు, కనీస వార్షిక విరాళము రూ.120/-; ప్యాకింగ్ & పోస్టేజి రూ.30/- అదనం!} ధార 5

## ముఖాముఖి

ప్రభువునందు ప్రియులైన 'కల్వరి ప్రేమధార' పాఠకులకు, శ్రేయోభిలాషులకు క్రీస్తు నామమున శుభమని చెప్పి వ్రాయుట!

ఇటువంటి అసాధారణ పరిస్థితుల్లో కూడా కల్వరి ప్రేమధార పత్రికను ప్రచురించుటకు, పంపించుటకు దేవుడు కృప చూపించుచున్నాడు. ఈ కరోనా వైరస్ వలన ఎందరో ఎన్నో విధములైన శ్రమలకు, బాధలకు, ఆర్థిక ఇబ్బందులకు గురవుచున్నారని ఎంతో విచారము కలుగుచున్నది. ప్రభువే కనికరించాలని, పరిపూర్ణమైన విడుదల కలుగజేయాలని ప్రార్థిస్తున్నాము! మరి మీరందరూ ఎలా ఉన్నారు?

గత ఆరు నెలలుగా ఆలయములు మూయబడినా; సభలు, మీటింగులు ఆగిపోయినా దేవుని మహాకృప వలన ప్రతి దినము Social Media ద్వారా ఉదయం 7 గం॥లకు 'అనుదిన ధ్యానం', మధ్యాహ్నం 3 గం॥లకు 'హెచ్చరిక', రాత్రి 9 గం॥లకు 'కల్వరి ప్రతిధ్వని' మరియు అర్థరాత్రి 12 గం॥లకు 'మన్నా మనకు' ద్వారా దేవుని వాక్యమును సమృద్ధిగా ప్రపంచమంతటిలో ఉన్న మన తెలుగు వారికి అందించుటకు ప్రభువే నాకు కృప చూపించియున్నాడు. మరి మీరు ఆలకిస్తున్నారా? "Dr Jayapaul" Youtube & Facebook పేజీలను Subscribe చేసుకున్నారా? వీటి విషయమై వివరాలు కావాలంటే 89 39 39 39 39 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు!

ప్రపంచములో ఏర్పడే ఈ గందరగోళాలు, మార్పులు అన్నీ అంత్య దినములను జ్ఞాపకము చేస్తున్నవని గుర్తించి, ప్రభువు రాకడ సమీపముగా ఉందని యెరిగి సమయమును సద్వినియోగపరచుకుందాం, ప్రభువు కృప కొరకు వేడుకుందాం! ఇట్టి పరిస్థితుల్లో మనలను బలపరచి, తన శాంతిని అనుగ్రహించు ప్రభువునందు విశ్వాసముంచుదాం! మనలను ప్రేమించి, మన పక్షమున పోరాడే ప్రభువును నమ్ముదాం! విడువను ఎడబాయనని ప్రభువుతో ముందుకు సాగుదాం!

1985వ సంవత్సరములో ప్రారంభించిన 'కల్వరి ప్రేమధార' పత్రిక సాహిత్య ప్రియులైన మీ కొరకు కొనసాగించుచున్నాము! ఈ పత్రిక పరిచర్య ద్వారా మీరు పొందుచున్న మేలులను తెలియపరచండి! మీ ప్రేమపూర్వక కానుకలు, విరాళములు పంపుట ద్వారా ఈ పరిచర్యలన్నిటిలో పాలిభాగస్థులై, పరిచర్య అభివృద్ధికి సహకరించండి!

- ఎడిటర్

Vol-XXIII ISS-V

Sep-Oct 2020 R.N.I. No.69868/98

## ఈ సంచికలో....

★ ఉపదేశ సారమేదనగా
★ రాజులు రెండవ గ్రంథము
★ మన శరీరములోని ఈ విషయములు
★ ఏడు తెగుళ్లు - ఏడు దూతలు
★ పండ్రెండు రత్నములు
★ రక్షణ మార్గము
★ నోటి మాటలో జారకుండుట
★ రక్తస్రావ రోగము గల స్త్రీ
★ బైబిలు గ్రంథ విభజన
★ ఎపఫ్రొదితు
★ గాలి బుడగల క్రైస్తవులు
★ యేసు ప్రభువు త్వరలో రానైయున్నాడు
★ ఈగను వాడుకొన్న దేవుడు
★ అర్థాలు తెలుసుకొందాం!
★ మనం ఎలా ప్రార్థించాలి?
★ మార్టిన్ లూథర్
★ వధువు సంఘము
★ ఆయన చేసిన ఉపకారములు మరువకు
ఇంకా...ఇంకా...ఎన్నెన్నో....

*Our Only Address:*

**JAYAPAUL FOUNDATIONS**
**29, NEW COLONY ROAD,**
**VELACHERY,**
**CHENNAI-600 042.**

**Phone : 044-2243 4787**
**Cell : (0) 98847 07779,**
**(0) 89 39 39 39 39**
**E-mail : Enquiry@jayapaul.com**
**Website : www.jayapaul.org**

సంపాదకీయం:

# ఉపదేశ సారమేదనగా....

**"ఉపదేశ సారమేదనగా పవిత్ర హృదయము నుండియు, మంచి మనస్సాక్షి నుండియు, నిష్కపటమైన విశ్వాసము నుండియు కలుగు ప్రేమయే"** (I తిమోతి 1:5).

పరిశుద్ధుడైన పౌలు ఉపదేశాల సారాన్ని మూడు ముక్కలలో తేల్చేసాడు. కొన్ని వేల సంవత్సరముల నుండి అనేక వేలమంది బోధకులు వేలాది వేల ప్రసంగాలు బైబిలులో నుండి చేయుచున్నారు. అయితే ఈ బోధలన్నిటి సారము, ప్రసంగాల సారము ఇదై యుండాలని పౌలు హెచ్చరిస్తున్నాడు.

అది ఏమనగా – పవిత్ర హృదయము, మంచి మనస్సాక్షి, నిష్కపటమైన విశ్వాసము; వీటిలో నుండి వచ్చే ప్రేమ! మనుష్యుని హృదయము మోసకరమైనదని, అది ఘోరమైన వ్యాధి కలదని బైబిలు హెచ్చరిస్తున్నది (యిర్మీయా 17:9).

మానవుని హృదయము పాపమును పోగుచేసుకొనుచున్నదని దావీదు అంటున్నాడు (కీర్తన 41:6). అటువంటి పాపపు నిలయముగా ఉన్న మానవుని హృదయమును పవిత్రపరచునదిగా దేవుని వాక్యమున్నది! ఒక వ్యక్తి దేవుని వాక్యమును వినుచున్నప్పుడు అతడు తన హృదయ స్థితిని గ్రహించుకొనును. తన పాపము కొరకు పశ్చాత్తాపపడును. ఎప్పుడైతే ఒక వ్యక్తి తన పాపములను ఒప్పుకొనునో, యేసుక్రీస్తు యొక్క రక్తము అతని హృదయమును శుద్ధి చేయును. అతని పాత రోత హృదయము పోయి, క్రీస్తు యిచ్చు నూతనమైన హృదయమును పొందును.

ఈ వర్తమానమును చదువుచున్న ప్రియ పాఠకా! నీవు క్రీస్తు యిచ్చు పవిత్ర హృదయాన్ని సంపాదించుకొన్నావా? అనుదినము ప్రార్థనతో, దేవుని వాక్యముతో నీ హృదయాన్ని పవిత్రముగా కాపాడుకొనుచున్నావా? "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొనియున్నాను" అని దావీదు అంటున్నాడు (కీర్తన 119:11).

రెండవది, మంచి మనస్సాక్షి! మనస్సాక్షి దేవుడు మనకు ఇచ్చిన "కావలివాని" వంటిది! మనము తప్పు చేయునప్పుడు మనలను హెచ్చరించునది. మనస్సాక్షి చీకటి గదిలో పెట్టిన దీపము వంటిది! మన కన్ను బహు సున్నితమైనది. ఒక చిన్న అణువు పడినను అది బయటకు పోవు వరకు కన్నీరు కార్చును. అయితే మనస్సాక్షి అంతకంటె సున్నితమైనది. మన హృదయములోనికి చిన్న దోషము ప్రవేశించినా మనస్సాక్షి వెంటనే హెచ్చరించును. గాని అనేకులు చచ్చిన మనస్సాక్షిని కలిగి యున్నారు. మనస్సాక్షి గద్దింపులను, హెచ్చరికలను లెక్కచేయక, మనస్సాక్షికి వ్యతిరేకముగా మనుష్యుడు పాపము చేయునప్పుడు అట్టివారి మనస్సాక్షి చచ్చిపోవును.

“మీ అపరాధముల చేతను, పాపముల చేతను మీరు చచ్చినవారైయుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రదికించెను” (ఎఫెసీ 2:1).

ప్రియ పాఠకా! నీ మనస్సాక్షి చచ్చిన స్థితిలో ఉన్నదేమో! దేవుడు ఈ వర్తమానము ద్వారా నిన్ను తట్టి లేపాలని ఆశిస్తున్నాడు. కొందరు నిద్రించుచున్న మనస్సాక్షిని కలిగియుందురు. అంటే వారి మనస్సాక్షి వారిని హెచ్చరించు చున్నప్పుడెల్లా వారు తమ మనస్సును మత్తు పదార్థములతో, మరి ఇతర కార్యాలతో నిద్రపుచ్చుచుందురు. ఒక త్రాగుబోతు తన త్రాగుడు మత్తు వదలగానే అతని మనస్సాక్షి అతనిని గద్దించుట, అతని తప్పును ఒప్పించుట గమనించినందున తిరిగి తన మనస్సాక్షిని నిద్రపుచ్చుటకు మరింత త్రాగును. ఇట్టివారు త్వరలోనే తమ మనస్సాక్షిని సమాధి చేయుదురు.

మరి కొందరు వాత వేయబడిన మనస్సాక్షిని కలిగియుందురు. మనస్సాక్షి తప్పు అని ఒప్పించిన కార్యాల కొరకు పశ్చాత్తాపపడినను వాటిని మానక, మరల మరల చేయువాడు వాత వేయబడిన మనస్సాక్షి గలవాడు! ఒక వ్యక్తి శరీరముపై వాత పెట్టినప్పుడు అది అతనికి బహు బాధ కలిగించును. కాని పదే పదే వాతపెట్టిన స్థలమునందే మరల మరల వాతపెట్టిన యెడల ఆ స్థలము మొద్దుబారిపోయి, ఎటువంటి బాధ లేకుండా తయారగును. అలాగే మనుష్యులు మొదటిసారి చేసిన తప్పుకు బాధపడినప్పటికి, పదే పదే అదే తప్పు చేయుచు చివరికి ఎటువంటి పశ్చాత్తాపమునకు చోటులేని వాతవేయబడిన మనస్సాక్షికి లోనగుదురు.

అయితే దేవుని వాక్యం వినువాడు మంచి మనస్సాక్షి కలిగియుండాలి! మన మనస్సాక్షికి వ్యతిరేకమైన పనులు చేయక, మనస్సాక్షి గద్దింపులకు లోబడాలి! ఎప్పటికప్పుడు దేవునితోను, మనుష్యులతోను మన మనస్సాక్షిని సరిచేసుకొంటూ ఉండాలి! “ఈ విధమున నేనును దేవుని యెడలను మనుష్యుల యెడలను ఎల్లప్పుడు నా మనస్సాక్షి నిర్దోషమైనదిగా ఉండునట్లు అభ్యాసము చేసికొనుచున్నాను” (అపొ. కార్య. 24:16) అని పౌలు అంటున్నాడు.

ఈ వర్తమానమును చదువుచున్న ప్రియ పాఠకా! నీవు మంచి మనస్సాక్షి కలిగియున్నావా? నీ మనస్సాక్షిని అపవిత్రపరచే కార్యాలను విడిచిపెట్టావా? “క్రీస్తు యొక్క రక్తము నిర్జీవ క్రియలను విడిచి జీవము గల దేవుని సేవించుటకు నీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధి చేయును” (హెబ్రీ 9:14).

మూడవదిగా, నిష్కపటమైన విశ్వాసము! ఈ దినములలో అనేకులు లాభమును అపేక్షించు విశ్వాసమును, తాత్కాలిక విశ్వాసమును, స్వార్థపూరిత విశ్వాసమును కలిగియున్నారు. దేవుడు నాకు ఈ సహాయము, ఆ సహాయము చేస్తే నేను ఆయనయందు విశ్వాసముంచుదును అంటున్నారే గాని; ప్రార్థనలో ఏవేవి అడుగుచున్నామో అవి మీకు దొరుకునన్న మాటను నమ్మలేకున్నారు. మనము

రక్షించబడటానికి విశ్వాసము అవసరం! రక్షించబడిన తరువాత మనము విశ్వాసమును బట్టి నడుచుకొనవలెను గాని, వెలిచూపును బట్టి కాదు (II కొరింథీ 5:6). అవును విశ్వాసము లేకుండ దేవునికిష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11:6).

ఈ వర్తమానమును చదువుచున్న ప్రియ పాఠకా! నీవు దేవుని యందు నిష్కపటమైన విశ్వాసమును కలిగియున్నావా? నీ విశ్వాసము వృద్ధియగుచున్నదా? లేక క్షీణించుచున్నదా? “వినుట వలన విశ్వాసము కలుగును. వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును” (రోమా 10:17). కనుక దేవుని వాక్యమును వినుము, ధ్యానించుము, విశ్వాసాభివృద్ధి పొందుము.

ఎప్పుడైతే నీవు పవిత్రమైన హృదయాన్ని, మంచి మనస్సాక్షిని, నిష్కపటమైన విశ్వాసాన్ని కలిగియుంటావో; అప్పుడు తేనెపట్టులోని తేనె నిండి, పొర్లి పారునట్లు నీ హృదయములో నుండి ప్రేమ పొర్లి పారును. కారణం, క్రీస్తు నీ హృదయ సింహాసనముపై ఉండును.

పవిత్రమైన దేవుని ప్రేమతో నీ బ్రతుకు నిండియుండును. బైబిలులోని సారమంతా పిండితే అది ‘ప్రేమ’ అనే రెండు అక్షరములతో చెప్పవచ్చును. క్రైస్తవ జీవిత పరిపూర్ణత ప్రేమయే! ప్రేమ లేనివాడు వ్యర్థుడే! ధర్మశాస్త్ర సారమునంతా రెండు మాటలతో చెప్పాడు ప్రేమమూర్తియైన ప్రభువు! నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణ మనస్సుతోను, నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణ వివేకముతోను ప్రేమింపవలెను; నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమింపవలెను (మార్కు 12:29–33). కనుక పవిత్ర హృదయము, మంచి మనస్సాక్షి, నిష్కపటమైన విశ్వాసము నుండి కలుగు ప్రేమ కలిగియుందాం!

– యన్. జయపాల్


**గొప్ప అవకాశం! 70% తగ్గింపు**

## కల్వరి ప్రేమధారల స్పైరల్ బౌండ్ బుక్స్

క్లుప్త సందేశాలు, ధ్యానాలు, వర్తమానములు మరియు 2500 చక్కటి ఆధ్యాత్మిక సంగతులు కలిగిన 7 సంవత్సరముల (2013, 2014, 2015, 2016, 2017, 2018 మరియు 2019) ‘కల్వరి ప్రేమధార’ బౌండ్ బుక్స్; ఒక్కొక్క బౌండ్ బుక్ వెల రూ. 150/-. కాని ప్రత్యేక తగ్గింపుగా కేవలం రూ. 500/- విరాళము పంపి, రిజిస్టర్డ్ పోస్ట్‌లో పొందగలరు! మరియు 2020 సంవత్సరపు పత్రికలు (ఇంతవరకు వెలువడినవి) ఉచితంగా పొందగలరు!

Google Pay, లేక Phonepe ద్వారా కూడా పంపవచ్చు! Screen Shot మరియు మీ చిరునామాను తప్పకుండా 9100 100 888 నంబర్‌కు Whatsapp చేయండి!

మీరు M.O.లు పంపవలసిన చిరునామా :

**CALVARY, 29, New Colony Road, Velachery, Chennai - 600 042.**

# రాజులు రెండవ గ్రంథము

| | | | |
|---|---|---|---|
| గ్రంథకర్త | : యిర్మీయా కావచ్చు! | అధ్యాయములు | : 25 |
| కాలము | : క్రీపూ. 586 కావచ్చు | వచనములు | : 719 |
| ముఖ్యాంశము | : యెహోవా మాట గైకొంటే దీవెన | ముఖ్య వచనములు | : 17:22; 23:27 |

**గ్రంథ విభజన**

1 - 17 అధ్యాయములు : చీలిపోయిన రాజ్యం

18 - 25 అధ్యాయములు : యూదా రాజ్యం

రాజుల గ్రంథములు దావీదు రాజుతో ప్రారంభమై, బబులోను రాజుతో ముగుస్తున్నవి. సొలొమోను కట్టిన దేవాలయము నిర్మాణముతో ప్రారంభమై, పతనముతో ముగుస్తుంది. 'యెహోవా సెలవిచ్చెను' అనే మాట ఈ గ్రంథములో ఇరవై సార్లు ఉన్నది. ఎలీషా ప్రవక్త యొక్క 66 సంవత్సరముల సేవా వివరములు, అతడు చేసిన 16 సూచక క్రియలు వివరములతో నిండియున్నది. ఏలీయా కంటె రెండింతల అద్భుతాలు ఎలీషా చేసాడు. ఏలీయా 33 సంవత్సరములు సేవ చేసి, 8 అద్భుతాలు చేసాడు. వీరిద్దరు మొత్తం 75 సంవత్సరములు సేవ చేసిరి. "యెహోవా మాట గైకొనుట వలన దీవెన" అన్నది ఈ గ్రంథ సారము!

ఇశ్రాయేలు, యూదా రాజుల చరిత్రలు ఇందులో వ్రాయబడ్డాయి! ఇశ్రాయేలు రాజులు 19 మంది! అందరూ యెహోవా దృష్టికి చెడునడత నడిచినవారే! యూదా రాజులు ఒక రాణితో పాటు మొత్తం 20 మంది! వీరిలో 8 మంది మాత్రమే దేవుని కిష్టులుగా జీవించారు.

రాజులు మొదటి గ్రంథము దావీదుతో ప్రారంభము కాగా, రాజులు రెండవ గ్రంథము బబులోను రాజుతో అంతమయ్యింది. రాజులు మొదటి గ్రంథము సొలొమోను వైభవము, మహిమతో ప్రారంభము కాగా; రాజులు రెండవ గ్రంథము యెహోయాకీము సిగ్గుతో ముగించెను. రాజులు మొదటి గ్రంథము విధేయత, ఆశీర్వాదముతో ప్రారంభము కాగా; రాజులు రెండవ గ్రంథము అవిధేయత, శాపముతో ముగించెను.

రాజులు మొదటి గ్రంథములో ఉన్న రాజుల పరిపాలనలో రాజ్యాలన్నీ ఓడిపోగా, రాజులు రెండవ గ్రంథములో పరిపాలనా లోపము వలన కలిగిన ఫలితాలను చూస్తున్నాము! రాజులు మొదటి గ్రంథములో ఏలీయా పరిచర్య చేయగా, రాజులు రెండవ గ్రంథములో ఎలీషా అభిషేకించబడి వాడబడటం చూస్తున్నాము! రాజులు మొదటి గ్రంథములో దేవుని దీర్ఘశాంతము చూడగా, రాజులు రెండవ గ్రంథములో దేవుడిచ్చు పాపశిక్షను చూస్తున్నాము!

రాణి అతల్యా దావీదు వంశాన్ని నాశనం చేయాలని ప్రయత్నించినా, దేవుడు దావీదుతో చేసిన ప్రమాణాన్ని బట్టి అతని వంశాన్ని కాపాడాడు (II సమూయేలు 7వ అధ్యాయము). మెస్సీయ అనగా క్రీస్తు, ప్రవచనాలు నెరవేరునట్లు అతని వంశములో నుండే వచ్చెను. – యన్. జయపాల్

# మన శరీరములోని ఈ విషయములు

✦ **గుండె:** 6 అంగుళాల పొడవు, 4 అంగుళాల వెడల్పు, 12 ఔన్సుల బరువు ఉంటుంది. ఒక దినమునకు ఇంచుమించు లక్ష పర్యాయములు కొట్టుకొనును. పదివేల లక్షల లీటర్ల రక్తాన్ని 60,000 మైళ్ళ పొడవు ఉన్న రక్తనాళములలోనికి పంపుతుంది.

✦ **ఊపిరితిత్తి:** ఒక ఊపిరితిత్తిలో ఇరవై యైదు వేల లక్షల గాలి బుడగలు కలవు.

✦ **చర్మము:** చర్మము ద్వారా నీరు, తేమ లోపలి నుండి బయటకు వస్తుంది గాని లోపలికి పోలేదు. మన శరీరములోని 1/3వ వంతు రక్త ప్రసరణ చర్మము గుండా జరుగుతుంది.

✦ **మూత్రపిండం:** ఒక మూత్రపిండంలో పది లక్షలకు పైగా ఫిల్టర్‌లుంటాయి. వాటిని సాగదీసి, ఒకదాని వెనుక ఒకటి ఉంచితే సుమారు 85 మైళ్ళ పొడవైన త్రాడు తయారవుతుంది.

✦ **ఎముకలు:** ఇటుకలు, రాళ్ళు కంటె 30 రెట్ల బరువును మోస్తాయి.

✦ **మెదడు:** సెరిబ్రమ్‌లోనికి వెళ్ళి బయటకు వచ్చే నరాల సంఖ్య 20 కోట్లు! ఎన్ని కణాలున్నాయంటే 1,00,00,00,000. ఇంత క్లిష్టమైనది మెదడు-నరాల వ్యవస్థ!

✦ **ఉదరము:** ఉదరము మనకు ఏ హాని కలుగకుండా హైడ్రో క్లోరిక్ ఆమ్లమును ఉత్పత్తి చేస్తుంది. మన శరీర గొప్ప మర్మాలలో ఇది ఒకటి! 70 సంవత్సరముల జీవిత కాలములో ఈ ఉదరం 67,500 లీటర్ల జీర్ణ రసాన్ని ఉత్పత్తి చేస్తుంది. మరియు 40 టన్నుల ఆహారాన్ని జీర్ణించుకొంటుంది.

✦ **స్వరపేటిక:** కొంతమంది గాయకులు ఒక సెకనుకు 1400 విధాలుగా తమ స్వరాలను హెచ్చు తగ్గులుగా వినిపించగలరు.

✦ **నేత్రములు:** రెటీనా, అతి పలుచని ఉల్లిపొర కాగితము కన్న పలుచని పొర! ఇది 137 మిలియన్ నరముల కొనలను కలిగియుండి, దృశ్యములను మెదడుకు తీసుకొనిపోతుంది. మానవుని కన్ను 17,000 రంగులను గుర్తించగలదు.

✦ **పాదములు:** ఒక పాదము 26 ఎముకలతో 33 జాయింట్లను కలిగి ఒక బలమైన బంధం ద్వారా కట్టబడుతుంది.

✦ **నరాలు:** శరీరంలోని కొన్ని నరాలు సెకనుకు 300 అడుగుల వేగంతో సందేశాలను ప్రసారం చేస్తే, మరికొన్ని సెకనుకు $1\frac{1}{2}$ అడుగుల చొప్పున మందగతితో ప్రసారం చేస్తాయి.

– యస్. జయపాల్

# ఏడు తెగుళ్లు - ఏడు దూతలు

(గత సంచిక తరువాయి....)

**మొదటి దూత** తన పాత్రను కుమ్మరించగా, ఆ క్రూరమృగము ముద్రను ధరించి, దానికి నమస్కరించిన వారికి బాధకరమైన చెడ్డపుండు పుట్టెను.

**రెండవ దూత** తన పాత్రను కుమ్మరించగా, సముద్రములోని నీరంతా పీనుగు రక్తము వంటిదాయెను. ఇంతకు ముందు రెండవ దూత బూర ఊదినప్పుడు సముద్రము లోని మూడవ భాగము రక్తమాయెనని చూచాము. అయితే ఇప్పుడు సముద్రములోని నీరంతా రక్తమైనది. అనగా సముద్రములోని నీరు ఇక పనికిరానిదైనది.

**మూడవ దూత** తన పాత్రను నదులలో కుమ్మరింపగా అవి రక్తమాయెను. అంతకు ముందు మూడవ దూత బూర ఊదినప్పుడు నీటి బుగ్గలలోని నీరు మూడవ వంతు పాడైనదని చూచాము. అయితే ఇప్పుడు త్రాగునీరు లేని స్థితి ఏర్పడినది.

**నాలుగవ దూత** తన పాత్రను కుమ్మరింపగా మనుష్యులను అగ్నితో కాల్చుటకు సూర్యునికి అధికారము యియ్యబడెను. సూర్యుని కిరణాలు మనుష్యుల దేహాలపై నేరుగా పడకుండునట్లు ఓజోన్ (Ozone) అనే పొరను దేవుడు ఆకాశములో ఉంచియున్నాడు.

అయితే ఈ లోకములో మానవుని ద్వారా చేయబడిన ఫ్యాక్టరీలు, ఆటోమొబైళ్ళు మొదలైన వాటి నుండి వెలువడే రసాయనిక వాయువులు ఆ పొరను పాడుచేయు చున్నవని; అనేక చోట్ల ఆ పొర పలుచబడి, రంధ్రములు పడినవని; ఆ రంధ్రముల ద్వారా ప్రసరించే సూర్య కిరణాలు (అతి నీలలోహిత కిరణాలు) మానవుని దేహముపై పడితే పొక్కులు, దద్దురులు కలుగునని విజ్ఞానవేత్తలు కనుగొంటున్నారు. అయితే నాలుగవ పాత్ర కుమ్మరించబడినప్పుడు ఆ ఓజోన్ పొర పూర్తిగా పాడై, సూర్యుని వేడిమికి మనుష్యులు కాలిపోవుదురు.

**అయిదవ దూత** తన పాత్రను కుమ్మరింపగా క్రూరమృగము యొక్క సింహాసనము, దాని రాజ్యము చీకటియాయెను.

**ఆరవ దూత** తన పాత్రను యూఫ్రటీసు అను మహానది మీద కుమ్మరింపగా, దాని నీరు ఎండిపోయెను.

ఆ ఘటసర్పము, క్రూరమృగము, అబద్ధ ప్రవక్త లోక రాజులతో ఏకమై ఆ భయంకరమైన తెగుళ్ళను, ప్రకృతి వైపరీత్యాలను అనుభవిస్తూ; ఇంకనూ దేవునిని దూషించుచు, దేవునితో పోరాడుటకు ప్రయత్నించెదరు గాని మారమనస్సు పొందరు. ఘటసర్పము అనగా సాతాను; క్రూరమృగము అనగా చిట్టచివరి ప్రభుత్వ రాజ్యాలు;

అబద్ధ ప్రవక్త అనగా తప్పుడు బోధల సంఘము; ఇవన్నీ కలిసి ఒకటియై నిజ సంఘముపై చేయు చిట్టచివరి యుద్ధమే హార్ మెగిద్దోను యుద్ధము!

అయితే హార్ మెగిద్దోను మైదానములో జరుగు ఈ యుద్ధములో రారాజైన క్రీస్తు చేతిలో అంత్యక్రీస్తు (క్రీస్తు విరోధి) చిత్తుగా ఓడిపోవును. అంత్యక్రీస్తు, అబద్ధ ప్రవక్త పట్టబడి ప్రాణములతోనే నరకములో వేయబడుదురు. అట్లు వారక్కడ వెయ్యి సంవత్సరములు బంధించబడుదురు.

**"ఏడవ దూత** తన పాత్రను వాయుమండలము మీద కుమ్మరింపగా, సమాప్తమైనదని చెప్పుచున్న యొక గొప్ప స్వరము గర్భాలయములో ఉన్న సింహాసనము నుండి వచ్చెను. అప్పుడు మెరుపులును ధ్వనులును ఉరుములును పుట్టెను, పెద్ద భూకంపము కలిగెను. మనుష్యులు భూమీ మీద పుట్టినది మొదలుకొని అట్టి మహా భూకంపము కలుగలేదు, అది అంత గొప్పది. ప్రసిద్ధమైన మహా పట్టణము మూడు భాగములాయెను, అన్యజనుల పట్టణములు కూలిపోయెను. తన తీక్షణమైన ఉగ్రతయను మద్యము గల పాత్రను మహా బబులోనుకు ఇయ్యవలెనని దానిని దేవుని సముఖమందు జ్ఞాపకము చేసిరి.

ప్రతి ద్వీపము పారిపోయెను, పర్వతములు కనబడకపోయెను. అయిదేసి మణుగుల బరువు గల పెద్ద వడగండ్లు ఆకాశము నుండి మనుష్యుల మీద పడెను; ఆ వడగండ్ల దెబ్బ మిక్కిలి గొప్పదైనందున మనుష్యులు ఆ దెబ్బను బట్టి దేవుని దూషించిరి" (ప్రకటన 16:17-21) అని బైబిలు చెప్పుచున్నది.

అదే మహా ఉగ్రత దినము! పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమైపోవును (II పేతురు 3:10-12). ఆ భయంకరమైన ఉగ్రత దినమును తప్పించుకొనుటకు నేడే కరుణా సంపన్నుడైన ప్రభువు పాదాలను పట్టుకొందాం!

**(సశేషం)** -యన్. జయపాల్

**(ప్రకటన గ్రంథమంతటిపై ధ్యానించి, వ్రాయబడిన 'ప్రకటన సందేశములు' పుస్తకము కావలసినవారు రూ. 100/- పంపి, పొందగలరు!)**


## 16 GB మెమొరీ కార్డ్స్ & పెన్ డ్రైవ్స్

★ సందేశాలు సంగీతాలు - యెరూషలేము (60 గంటలు)
★ కల్వరి సునాద గీతములు - కుటుంబమును కట్టు సత్యములు (60 గంటలు)
★ మీకు తెలుసా? - మన్నా మనకు (60 గంటలు)

**ఒక్కొక్కదాని వెల రూ. 1,000/-. అయితే తగ్గింపు ధరగా రూ. 700/- లకే పొందగలరు!**

**మా చిరునామా : Dr. N. JAYAPAUL, 29, New Colony Road, Velachery, Chennai - 600 042.** మరిన్ని వివరములకు – (0) 89 39 39 39 39

ధ్యానం :

# పండ్రెండు రత్నములు

**"ఆ పట్టణపు ప్రాకారపు పునాదులు అమూల్యమైన నానావిధ రత్నములతో అలంకరింపబడి యుండెను".** (ప్రకటన 21:19,20)

❖ **సూర్యకాంతపు రాయి :** ఇది పలువిధములైన రంగులు కలిగి మెరయుచుండును. క్రీస్తు ప్రభువును, ఆయన పరిశుద్ధులను ఇది తెలియజేయును. (ప్రకటన 21:19)

❖ **నీలము :** ఇది ఆకాశపు రంగును కలిగి బహు అందముగా యుండును. ఈ రాయిలో ఎరుపు, నీలిరంగు, పసుపు మిళితమై యుండును. చాలా విలువైనది. (యోబు 28:16)

❖ **యమునా రాయి :** ఈ రత్నము కూడా కొన్ని రంగులు కలిగినదై రాగి రూపములో కనబడును. ఇది ప్రభువులో యున్న గట్టితనమును తెలుపును.

❖ **పచ్చ :** కలత లేని రత్నము. పచ్చ పునరుత్థానమును సూచించును. క్రీస్తు ప్రభువు యొక్క పునరుత్థాన శక్తి ఆయన భక్తులలో ప్రజ్వరిల్లుచుండెను.

❖ **వైఢూర్యము :** ఈ రత్నము భక్తులలో గల ఆధ్యాత్మిక ఆరోగ్యమును సూచించును.

❖ **కెంపు :** ఎరుపు రంగు కలిగి, తెలుపు ఛాయ యుండును. మహిమలో భక్తుల విమోచన, రక్తములోని శ్రేష్ఠతను ప్రకాశింపజేయును.

❖ **సువర్ణ రత్నము :** పసుపు రంగు కలిగిన రాయియై యుండి, క్రీస్తు ప్రభుని దైవ స్వభావము ఆయన భక్తులలో ప్రకాశించుచుండుటను సూచించును.

❖ **గోమేధికము :** సముద్రపు రంగును కలిగిన రత్నము. క్రీస్తు ప్రభువును, ఆయన భక్తులును లోకరీతిని బీదలుగా జీవించిన స్థితిని ఇది తెలియజేయును.

❖ **పుష్యరాగము :** ఇది పాలిపోయిన రంగును కలిగియుండును. క్రీస్తు ప్రభువు ఆయన భక్తుల కన్నీటిని, వ్యాధిని, వ్యసనమును తొలగించినాడని తెలుపును. (మత్తయి 8:17)

❖ **సువర్ణల శునీయము :** ఉల్లిపాయ రంగు కలిగియుండును. బంగారపు రంగులో పచ్చరంగు కలిగియుండును. ఇది పరిశుద్ధాత్ముని నింపుదలను సూచించును. పరిశుద్ధులు ఆత్మపూర్ణులై యుందురు.

❖ **పద్మరాగము :** తామర పుష్పము రంగు కలిగియుండును. కురువిందము వలె అంత నీలవర్ణము లేకయుండును. భక్తుల తేజస్సులో ఇది యొక విధము!

❖ **సుగంధము :** దీనిని ధర్మ రత్నమని కూడా అందురు. భక్తులు ప్రభువును ముఖాముఖిగా దర్శించుటను ఇది సూచించును. ఇది ఊదారంగు అనగా గాఢమైన ఎరుపు, నీలిరంగు కలిసియుండును. **– యన్. జయపాల్**

వర్తమానం :

# రక్షణ మార్గము

'రక్షణ' అనే పదమునకు 'విడుదల, క్షేమము, భద్రత, సౌఖ్యము' అనే అర్థములు కూడా ఉన్నవి. పాపముల చేత, దోషముల చేత నిండి; తనను తాను రక్షించుకొనుటకు శక్తిలేని ప్రమాదకరమైన స్థితిలో మానవుడు ఉన్నాడు. గనుక రక్షణ మానవునికి అవసరం!

ఆదాము, హవ్వల అవిధేయత ద్వారా పాపము, మరణము మానవ జాతిలోనికి ప్రవేశించాయి. అప్పటి నుండి మానవుడు దైవ ప్రమాణాలకు అందని కురచవాడుగా అయిపోయినాడు. మానవుడు శూన్యతకు, బంధకములకు, రోగములకు, అవినీతికి, తిరుగుబాటుకు, అపవిత్రతకు మరియు మరణమునకు లోనయ్యాడు. "పాపము చేయక మేలు చేయుచుండు నీతిమంతుడు భూమిమీద ఒకడైనను లేడు" (ప్రసంగి 7:20). ఈ పాపము యొక్క సమస్యను ఏ మానవ శక్తియు పరిష్కరించలేదు.

తమ స్వంత ప్రయత్నముల ద్వారా రక్షణ పొందుటకు మన భారత దేశములో ఎంతోమంది ప్రయత్నిస్తున్నారు. రక్షణ పొందుటకు మౌనంగా తపస్సు చేసేవారు కొందరైతే, ముండ్ల పడకలపై పరుండేవారు మరికొందరు! ఎంతోమంది వందల కొలది మైళ్ళ దూరం నడిచి తీర్థయాత్రలు చేయుచున్నారు. అయితే చివరకు ఫలితము చూడలేకపోవుచున్నారు.

మన క్రియలను బట్టి కాక, దేవుని కృప చేతనే మనము రక్షింపబడుదుమని బైబిలు చెప్పుచున్నది (ఎఫెసీ 2:8,9). "ఎవడును ఏ విధము చేతనైనను తన సహోదరుని విమోచింపలేడు... వారి ప్రాణ విమోచన ధనము బహు గొప్పది" (కీర్తన 49:7-9). వెండి బంగారముల వంటి క్షయమైన వస్తువుల చేత లేదా గొఱ్ఱెల యొక్కయు మేకల యొక్కయు రక్తము చేత మనము రక్షింపబడలేదు గాని; నిష్కళంకమును, నిర్దోషమును, అమూల్యమునైన పాపము లేని క్రీస్తు రక్తము చేతనే విమోచింపబడి రక్షింపబడితిమి (I పేతురు 1:18,19). అవును, రక్తము చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు (హెబ్రీ 9:22).

మనకు బదులుగా మరణించిన క్రీస్తు, మన రక్షణకు మూలాధారము! యేసు ఈ లోకమునకు వచ్చి, మన పాపములను భరించి, పాప శిక్ష నుండి వెల యిచ్చి విడిపించుటను బట్టి విమోచనము కలిగెను. "మనము పాపముల విషయమై చనిపోయి, నీతి విషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను" (I పేతురు 2:24). యేసు మానవ

పాపములకు శాంతికరమాయెను. ఆయన మన పాపముల కొరకు మన స్థానమందు మరణించెను. ఆయన మరణించి, తిరిగి లేచుటను బట్టి ఈనాడు మానవాళికి సజీవుడైన రక్షకునిగా ఉన్నాడు. కనుక క్రీస్తు మానవ వినాశనమునకు దేవుని పరిహారముగా చేయబడెను.

రక్షణ ప్రభువు అనుగ్రహించునదే! "మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొ. కార్య. 4:12). "నేను తప్ప మరి ఏ దేవుడును లేడు. భూదిగంతముల నివాసులారా, నా వైపు చూచి రక్షణ పొందుడి" (యెషయా45:21,22). విశ్వాసము వలన కృప చేతనే మీరు రక్షింపబడియున్నారు (ఎఫెసీ 2:8).

మనము కేవలము ఆ సిలువ వైపు చూచి, ఆ సిలువ కాంతిలో మనలను చూచుకొన్నట్లయితే; మనం కూడా పేతురు వలె "ప్రభువా, నన్ను విడిచిపొమ్ము; నేను పాపాత్ముడను" (లూకా 5:8) అని కేక వేయుదుము! అవును, మనం పతనమైపోయిన వారమని గమనించగలం! అప్పుడే మన హృదయాల్లో ఉన్న దుష్టత్వమును, చెడుగును చూడగలం! మన స్వనీతి మురికి పీలిక అని గమనించగలం (యెషయా 64:6).

సిలువపై వ్రేలాడే క్రీస్తును చూచి, ఆయన మనకు బదులుగా మన స్థానములో మరణించాడని; దరిద్రులము, పతనమైపోయినవారము, దోషారోపణ చేయబడిన పాపాత్ములమునైన మన కొరకు ఆయన తన జీవితము యిచ్చుటకు మన పాపము లన్నింటిని భరించాడని నమ్మినట్లయితే మనం బ్రదుకుదుము. అప్పుడు మనం దావీదు వలె 'నేను నా పాపములను ఒప్పుకొనుచున్నాను, నేను చేసిన పాపముల విషయమై పశ్చాత్తాపపడుచున్నాను' (కీర్తన 38:18) అని చెప్పగలం!

మన పాపముల విషయమై మనం బాధపడాలి, పశ్చాత్తాపము నొందాలి! "దైవ చిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును" (II కొరింథీ 7:10). కనుక మనం పాపముల నుండి వైదొలగాలి, దుఃఖపడాలి! నిజమైన పశ్చాత్తాపము ఒప్పుకోలుకు, దేవుని సన్నిధి తిరిగి పొందుటకు నడిపించును.

సమరయ స్త్రీ ప్రజల యొద్దకు వెళ్ళి, 'నేను చేసినవన్నియు నాతో చెప్పిన ఈ రక్షకుని చూడుడి' అని ఒప్పుకొనెను (యోహాను 4:29). "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగినవాడును, నీతిమంతుడును గనుక సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (I యోహాను 1:9). జక్కయ్య – "నేనెవని యొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసికొనిన యెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను" (లూకా 19:8).

“పేతురు – మీరు మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి” (అపో. కార్య. 2:38) అని చెప్పెను. గనుక ‘ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము; అప్పుడు నీవును నీ యింటి వారును రక్షణ పొందుదురు’ (అపో. కార్య. 16:31).

“ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే” (మత్తయి 7:13–14); “చూడుడి; నేడు నేను మీ యెదుట దీవెనను శాపమును పెట్టుచున్నాను. నేడు నేను మీకాజ్ఞాపించు మీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను మీరు వినిన యెడల దీవెనయు, మీరు మీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను వినక నేడు నేను మీకాజ్ఞాపించు మార్గమును విడిచి మీరెరుగని యితర దేవతలను అనుసరించిన యెడల శాపమును మీకు కలుగును” (ద్వితీయో 11:26–28). గనుక ‘తీర్మానించుకో; ఏది కావాలో కోరుకో, పొందుకో’ అని బైబిలు చెప్పుచున్నది.

డాక్టరు ఏ మందులు వాడాలో మాత్రమే చెప్పగలడు, అయితే ఆ మందులు నీవు తీసుకోవాలి! ఆలాగే రక్షణను ప్రభువు యొద్ద నుండి ప్రతి మానవుడు వ్యక్తిగతముగా పొందుకొనవలసినది. నీవు ఒక పాపివని గ్రహించి, క్రీస్తు నీ కొరకు చనిపోయాడని నమ్మి, ఆ క్రీస్తు నొద్దకు వెళితే; పరిశుద్ధాత్ముని చేత ఒప్పింపబడి, మార్పు నొందగలవు! మరియు నీవు నీ హృదయ పూర్వకంగా ప్రభువు వైపు తిరగాలి! నిర్దోషమైన మనస్సాక్షి కొరకు నీవు దొంగిలినవి యిచ్చివేయాలి, నీ శత్రువులతో సమాధానపడాలి! పరిశుద్ధాత్ముడే మనలను పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు ఒప్పింపజేయును (యోహాను 16:8).

ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యము చేసిన యెడల ఎట్లు తప్పించుకొందుము (హెబ్రీ 2:3). నిత్యమైన మరణము నుండి, అగ్ని గంధకముల నుండి మన ఆత్మ రక్షింపబడుటకు ఇదే గొప్ప రక్షణ! పాప శిక్ష నుండి, దోషారోపణ నుండి మనము రక్షింపబడితిమి! పాపపు అలవాట్ల నుండి, సాతాను ఆధిపత్యము నుండి రక్షింపబడుచున్నాము. ఎంత గొప్ప రక్షణ! ఎంత గొప్ప రక్షకుడు! ‘ఇదియే అనుకూల సమయము, ఇదియే రక్షణ దినము’ (II కొరింథీ 6:2).

– యస్. జయపాల్


మీ కానుకలు, విరాళములు మరియు కల్వరి ప్రేమధార పత్రిక వార్షిక విరాళమును ఇప్పుడు అతి సులువుగా Google Pay (G Pay) మరియు Phone Pe ద్వారా పంపించవచ్చు!

దయచేసి రుసుము పంపిన తరువాత మీ వివరాలు తెలియజేయుట మరచిపోవద్దు!

JAYAPAUL N
+91 9100 100 888

# నోటిమాటలో జారకుండుట

**"సమూయేలు పెద్దవాడు కాగా యెహోవా అతనికి తోడైయున్నందున అతని మాటలలో ఏదియు తప్పిపోలేదు".** (I సమూయేలు 3:19)

అతని మాటలలో ఏదియు తప్పిపోలేదు. అతడు చెప్పినదేదియు జరుగకుండా పోలేదు. అతని మాటలలో ఏ తప్పును లేదు. ఎందువలన? యెహోవా అతనికి తోడైయుండుట వలన! నేను నీ నోటికి తోడైయుండెదనని యెహోవా మోషేకు సెలవిచ్చెను (నిర్గమకాండము 4:12).

"నీవు మౌనివై వారిని గద్దింపకయుండునట్లు నేను నీ నాలుక నీ అంగిటికి అంటుకొనజేసెదను. అయితే నేను నీతో మాటలాడి నీ నోరు తెరచెదను" (యెహెజ్కేలు 3:26,27) అని దేవుడు యెహెజ్కేలుతో చెప్పెను. అబ్బ! ఎంత భాగ్యము! దేవుడు మనకు తోడైయుండి, అవసరమైనప్పుడే మాట్లాడునట్లు చేయుచు, మిగిలిన సమయంలో మన నాలుక మన అంగిటికి అంటుకొనియుండునట్లు చేయుట ఎంత భాగ్యము! ఎన్ని అనవసరమైన మాటల నుండి, పనికిరాని మాటల నుండి మనము తప్పించబడుదుమో గదా! దేవునితో స్నేహము చేసేవారికి దేవుడు ఇవి నేర్పించును.

స్నేహం అంటే ప్రేమ కదా! అవును ప్రేమ కొద్దిగా మాట్లాడును. ప్రేమ డంబముగా ప్రవర్తింపదు. ప్రేమ వినుటకు వేగిరపడును, మాటలాడుటకు నిదానించును. దేవుని ప్రేమ నీలో ఉంటే, నీ మాటలు అలసినవానిని ఊరడించే మాటలుగా యుండును. గాని అనేకుల మాటలు పనికిరానివిగాను, కొరుకుడు పుండు వంటివిగాను, నాశనము చేయునవి గాను ఉన్నవి (II తిమోతి 2:18).

నీ నోరు దేవుని అదుపులో ఉన్నదా? ఎవడైనను నోటికి కళ్ళెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తి గలవాడనని అనుకొనిన యెడల వాని భక్తి వ్యర్థమే (యాకోబు 1:26). క్రీస్తు ప్రభువును గూర్చి సాక్ష్యము చెప్పే నోరు నీకున్నదా? దేవుడు చేయు ఆశ్చర్య కార్యములను తెలియజేసే పెదవులు నీకున్నవా? లేనియెడల కొండెములతోను, డంబములతోను, అబద్ధములతోను నీ నోరు నిండియున్నదా?

'అయ్యో, ప్రభువా! నేను అపవిత్రమైన పెదవులు గలవాడను, నన్ను కనికరించుము' అని ప్రార్థించు! అప్పుడు ప్రభువు నీ పెదవులను, నీ నాలుకను ముట్టి నీ నోటికి తోడైయుండును. అప్పుడు నీ నోటి మాటలలో ఏదియు తప్పిపోదు. నీ మాటలు అనేకులను క్రీస్తు యొద్దకు నడిపించును. **– యన్. జయపాల్**

వనితలకు:

## విశ్వాసముతో ముట్టి బాగుపడిన

# రక్తస్రావ రోగము గల స్త్రీ

**"పంద్రెండేండ్ల నుండి రక్తస్రావ రోగము కలిగిన యొక స్త్రీ యుండెను. ఆమె అనేక వైద్యుల చేత ఎన్నో తిప్పలు పడి తనకు కలిగినదంతయు వ్యయము చేసికొని, యెంత మాత్రమును ప్రయోజనము లేక మరింత సంకటపడెను. ఆమె యేసును గూర్చి విని - నేను ఆయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదు ననుకొని, జన సమూహములో ఆయన వెనుకకు వచ్చి ఆయన వస్త్రము ముట్టెను. వెంటనే ఆమె రక్తధార కట్టెను గనుక తన శరీరములోని ఆ బాధ నివారణయైనదని గ్రహించుకొనెను".** (మార్కు 5:25-29)

రోగము, వ్యాధి, బాధ, కన్నీరు మనుష్యుని పాపము వలన కలిగినవి. దేవుడు మనలను పరిపూర్ణులుగా, సంపూర్ణులుగా చేసెను గాని; దేవుడు తినవద్దని చెప్పిన ఫలములు తిన్న ఆదాము, హవ్వలు భయమునకు గురియైరి. అనేక వ్యాధులకు, రోగాలకు భయమే ముఖ్యమైన కారణము! పాపము వలన వచ్చు జీతము మరణము కాగా, పాపము యిచ్చు బేటా రోగముగా మారి; ఆనాటి నుండి ఈనాటి వరకు మానవుడు రకరకాల రోగాలకు గురియౌతూనే ఉన్నాడు.

వైద్య శాస్త్రము ఎంత అభివృద్ధి చెందినా, ఎన్ని క్రొత్త మందులు కనిపెట్టినా క్రొత్త రోగాలు పుడుతూనే యున్నాయి గాని; రోగ నివృత్తి కలుగుట లేదు. అయితే క్రీస్తు ప్రతి రోగానికి కారణమైన పాపాన్ని నివృత్తి చేయటానికి మన రోగములను భరించి, మన వ్యసనములను వహించటానికి ఈ లోకంలోనికి వచ్చాడు. "నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడిన వానిగాను దేవుని వలన బాధింపబడిన వానిగాను శ్రమనొందిన వానిగాను మన మతనిని ఎంచితిమి. మన యతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది" (యెషయా53:4,5). గనుక ఆయన మాత్రమే మనకు సంపూర్ణ స్వస్థత యివ్వగలడు.

అయితే రక్తస్రావ రోగము గలిగిన ఈ స్త్రీ అనేక వైద్యులను సంప్రదించినది, అనేక మందులను వాడినది గాని ప్రయోజనము లేకపోయెను. ఈనాడు మనుష్యుడు తన రోగాలు పోగొట్టుకొనుటకు అలోపతి, హోమియోపతి, ఆయుర్వేదము అనే రకరకాల వైద్యాలు చేయించుకొనుటే గాక; భూత వైద్యము, మూలిక వైద్యము, ఆ

వైద్యము ఈ వైద్యము అంటూ అన్నీ ప్రయత్నించి మరింత సంకటాలకు గురియౌతున్నాడు. ఈమె నానా వైద్యుల చేత తిప్పలు పడి, తనకున్నదంతా వ్యయపరచుకొనెను అని వ్రాయబడి యున్నది.

ఈనాడనేకమంది తమ సంపాదనలో ఎంతో భాగము మందులకు, వైద్యులకు ఖర్చు పెడుతున్నారు. అయినను ఆరోగ్యము, నెమ్మది లేక అవస్థపడుతున్నారు. అయితే "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవా యందు నమ్మకముంచుము, నీ ప్రవర్తన అంతటి యందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము; అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును. నేను జ్ఞానిని గదా అని నీవనుకొనవద్దు, యెహోవా యందు భయభక్తులు కలిగి చెడుతనము విడిచిపెట్టుము; అప్పుడు నీ దేహమునకు ఆరోగ్యమును నీ యెముకలకు సత్తువయు కలుగును" (సామెతలు 3:5-8) అని బైబిలు చెప్పుచున్నది.

మనలను సృష్టించిన సృష్టికర్తే మనలను బాగుచేయగలడు. Doctor cuts but God heals (డాక్టరు గాయాలు చేస్తాడు, దేవుడు గాయాలను బాగుచేస్తాడు) అని అనేక హాస్పిటళ్ళలో వ్రాయబడి యున్నట్లు మందులు, ఇంజక్షన్లు డాక్టరు యిస్తాడు గాని; అవి లోపలికి వెళ్ళి, క్రియ చేయునట్లు చేయువాడు దేవుడే! గనుక దేవుని సహాయము లేకుండా మానవుడు ఎన్ని వైద్యాలు చేయించుకొన్నా స్వస్థత పొందలేడు.

"నీ గాయము చేత నీవు అరచెదవేమి? నీకు కలిగిన నొప్పి నివారణ కాదు; నీ పాపములు విస్తరించినందున నీ దోషములను బట్టి నేను నిన్ను ఈలాగు చేయుచున్నాను" (యిర్మీయా 30:15) అని బైబిలు చెప్పుచున్నది. అయితే మన పాపముల కొరకు పశ్చాత్తాపపడి, ప్రభువు దగ్గరకు వచ్చినప్పుడు "నేను నీకు ఆరోగ్యము కలుగజేతును, నీ గాయములు మాన్పెదను" (యిర్మీయా 30:17) అని ప్రభువు అంటున్నాడు.

ఈ స్త్రీ తన రోగము పోగొట్టుకొనుటకు అనేక ప్రయత్నాలు చేసి, తనకు కలిగినదంతయు వ్యయము చేసికొనెను గాని; ఎంత మాత్రము ప్రయోజనము లేక మరింత సంకటపడెను. మనలను మనము బాగుచేసికొనుట మన వశములో లేదు. మన స్వంత ప్రయత్నాలు మనలను మరింత సంకటాలకు గురిచేయును గాని, విడుదలను కలుగజేయవు. అట్టి స్థితిలో ఉన్న ఈ స్త్రీ యేసును గురించి విని, 'నేనాయన వస్త్రములు మాత్రము ముట్టిన బాగుపడుదుననుకొని' జన సమూహములో ఆయన వెనుకకు వచ్చి ఆయన వస్త్రము ముట్టెను.

ఈమె యేసును గరించి విని, విశ్వసించినది. "వినుట వలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17).

అందుకే రోగులు, వ్యాధిగ్రస్థులు మొదట సువార్తను వినాలి! క్రీస్తును గురించి వినుట వలన విశ్వాసము పొందిన ఈ స్త్రీ 'నేను ఆయన వస్త్రము మాత్రము ముట్టిన ముట్టిన బాగుపడుదుననుకొనెను'.

ఈనాడనేకులు 'రక్షించబడాలనుకొన్నాను, మారుమనస్సు పొందాలనుకొన్నాను, యేసుక్రీస్తును నమ్ముకోవాలనుకొన్నాను గాని...' అంటూ సాకులు చెప్తూ నెలలు, సంవత్సరాలు గడిపేస్తూనే యున్నారు. అయితే ఈ స్త్రీ పరిస్థితులను లెక్క చేయక; జన సమూహాలు ఉన్నారని, తన రోగము అందరి యెదుట చెప్పుకొనుటకు వీలుపడినది కాదని అనుకొనక; వెనుక తట్టు వెళ్ళి, ఆయన వస్త్రమును ముట్టెను. వెంటనే ఆమె రక్తధార కట్టెను గనుక ఆమె శరీరములోని ఆ బాధ నివారణయైనదని గ్రహించుకొనెను.

యేసు ప్రభువు యిచ్చే స్వస్థత, విడుదల సంపూర్ణమైనది, పరిపూర్ణమైనది. ఆయనను ముట్టిన వెంటనే పన్నెండు సంవత్సరముల నుండి ఆమెను వేదనపరచుచున్న బాధ నివారణయైనది. ఆమె సంతోషముతో తిరిగి వెళ్ళిపోవుటకు సిద్ధపడుచుండగా, ప్రభువు – 'నన్ను ముట్టినది ఎవరు?' అని అడిగెను. ఈనాడనేకులు క్రీస్తు యిచ్చు స్వస్థతను పొంది, తమ దారిన తాము వెళ్ళిపోవుచున్నారు. కాని ప్రభువు నిన్ను స్వస్థపరచినది ఇక నుండి నీవు నీ దారిని కాక, ప్రభువు మార్గములో నడుచునట్లు; నీ పాత జీవితమును వదలి, క్రీస్తు కొరకు సాక్షిగా బ్రతుకునట్లు, నీ వలె బాధలలో ఉన్నవారిని నీవు ప్రభువు నొద్దకు తెచ్చునట్లు అని అనేకులు గుర్తించుట లేదు.

విస్తారమైన జన సమూహములు ఆయన మీద పడుచున్నను; నాలో నుండి ప్రభావము బయలు వెళ్ళినది, నన్నెవరో విశ్వాసముతో ముట్టిరని ప్రభువు అనెను. "అప్పుడా స్త్రీ తనకు జరిగినది యెరిగి, భయపడి, వణకుచు వచ్చి, ఆయన ఎదుట సాగిలపడి, తన సంగతి యంతయు ఆయనతో చెప్పెను. అందుకాయన – కుమారీ, నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను, సమాధానము గలదానవై పొమ్ము; నీ బాధ నివారణయై నీకు స్వస్థత కలుగు గాక అని ఆమెతో చెప్పెను" (మార్కు 5:33,34).

ప్రభువును విశ్వాసముతో ముట్టిన వెంటనే ఆమె స్వస్థత పొందినది. అయితే ఆమె ఆ సంగతిని బహిరంగముగా సాక్ష్యమిచ్చి ఒప్పుకొనిన తరువాత, 'నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను; సమాధానము గలదానవై పొమ్ము' అన్న ప్రభువు మాటలు; ఆమె రోగానికి కారణమైన పాపములను క్షమించునవి గాను, ఇకమీదట మరల పాపము చేయకుండా శక్తినిచ్చి, సంపూర్ణ స్వస్థత నిచ్చునవిగాను ఉండెను. పరిపూర్ణ రోగ నివారణకు పాప క్షమాపణే మందు!

ఒక వ్యక్తి స్వస్థత పొందిన తరువాత పశ్చాత్తాపపడి, క్రీస్తును రక్షకుడుగా అంగీకరించి, బాప్తిస్మము పొంది, ప్రభువు బిడ్డలతో సహవాసం చేయాలి! ముప్పై

ఎనిమిది యేండ్లు వ్యాధిగ్రస్థుడై పడియున్న రోగిని ప్రభువు స్వస్థపరచెను. "అటు తరువాత యేసు దేవాలయములో వానిని చూచి – ఇదిగో స్వస్థత నొందితివి; మరి యెక్కువ కీడు నీకు కలుగకుండునట్లు ఇకను పాపము చేయకుమని చెప్పగా వాడు వెళ్లి, తన్ను స్వస్థపరచినవాడు యేసు అని యూదులకు తెలియజెప్పెను" (యోహాను 5:14,15). ఆలాగే పుట్టు కుంటివానిని నజరేయుడైన యేసు నామములో పేతురు, యోహానులు స్వస్థపరచినప్పుడు వాడు దిగ్గున లేచి, నడుచుచు గంతులు వేయుచు, దేవుని స్తుతించుచు వారితో కూడా దేవాలయములోనికి వెళ్ళెను (అపో. కార్య. 3:1–10).

అయితే ఈనాడనేకులు ప్రభువిచ్చిన స్వస్థతను అనుభవించిన తరువాత ఏవో కొన్ని కానుకలు చెల్లించి, తిరిగి వెళ్ళి వారి ఇష్టానుసారంగా జీవిస్తున్నారు. గనుకనే వారు మరల మరల వ్యాధిగ్రస్థులవుతూ అనేక సమస్యలకు, చిక్కులకు గురౌతున్నారు. క్రీస్తు మన శరీరములను ముట్టి, స్వస్థపరచిన తరువాత మన మనస్సును, మన ఆత్మను ప్రభువుకు సమర్పించుకొని; పరిశుద్ధతతో, ఘనతతో మన మన ఘటాలను కాపాడుకోవాలి! రోగానికి కారణమైన పాపము నుండి మనలను విడిపించగలిగిన ప్రభువు నాశ్రయిస్తూ, ఆయన వాక్యపు వెలుగులో నడవాలి! ఎప్పటికప్పుడు ఆయన రక్తములో మనల్ని మనం కడుక్కొని శుద్ధులమవ్వాలి!

"ప్రియులారా, మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక, దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసికొందము" (II కొరింథీ 7:1). అప్పుడే మనము పూర్ణమైన స్వస్థత, పరిపూర్ణమైన విడుదల కలిగి ప్రభువు కొరకు సాక్షులుగా జీవిస్తాము!

– యన్. జయపాల్


ప్రార్థించండి! **ది కల్వరి చర్చి** పాల్గొనండి!

పాస్టర్ : N. మైఖేల్ పాల్ వివరములకు : **8144 123 456**

| విజయవాడ | గుంటూరు |
| --- | --- |
| స్వర్ణాస్ కన్వెన్షన్ | ది కల్వరి చర్చి |
| NAC కళ్యాణ వేదిక ప్రక్కన | సీసన్స్ అపార్ట్‌మెంట్ ఎదురుగా |
| గురునానక్ కాలనీ, | విద్యానగర్ మొదటి లైన్ ఎక్స్టెన్షన్ |
| మెయిన్ రోడ్, విజయవాడ | గుంటూరు |
| ఉదయం 7:00 నుండి 10:00 వరకు | మధ్యాహ్నం 3:00 నుండి 5:00 వరకు |

ఆరాధనలు ప్రారంభమైనవి! తగు జాగ్రత్తలతో రండి!

# బైబిలు గ్రంథ విభజన

పాత నిబంధన నాలుగు భాగములుగా విభజింపబడెను. అవి –

**1. చట్టము** : ఆది కాండము, నిర్గమ కాండము, లేవీయ కాండము, సంఖ్యా కాండము, ద్వితీయోపదేశ కాండము.

**2. చరిత్ర** : యెహోషువ, న్యాయాధిపతులు, రూతు, సమూయేలు మొదటి గ్రంథము, సమూయేలు రెండవ గ్రంథము, రాజులు మొదటి గ్రంథము, రాజులు రెండవ గ్రంథము, దినవృత్తాంతములు మొదటి గ్రంథము, దినవృత్తాంతములు రెండవ గ్రంథము, ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు.

**3. కావ్యము** : యోబు గ్రంథము, కీర్తనల గ్రంథము, సామెతలు, ప్రసంగి, పరమ గీతము.

**4. ప్రవచనము** : యెషయా గ్రంథము, యిర్మీయా గ్రంథము, విలాప వాక్యములు, యెహెజ్కేలు, దానియేలు, హోషేయ, యోవేలు, ఆమోసు, ఓబద్యా, యోనా, మీకా, నహూము, హబక్కూకు, జెఫన్యా, హగ్గయి, జెకర్యా, మలాకీ.

క్రొత్త నిబంధన గ్రంథము నాలుగు భాగములుగా విభజింపబడెను. అవి –

**1. యేసుక్రీస్తు జీవిత చరిత్ర** : మత్తయి సువార్త, మార్కు సువార్త, లూకా సువార్త, యోహాను సువార్త.

**2. సంఘ చరిత్ర** : అపొస్తలుల కార్యములు

**3. నీతి బోధ (పత్రికలు)** : అపొస్తలుడైన పౌలు – రోమీయులకు వ్రాసిన పత్రిక, కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక, కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక, గలతీయులకు వ్రాసిన పత్రిక, ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక, ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక, కొలొస్సయులకు వ్రాసిన పత్రిక, థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక, థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక, తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక, తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక, తీతుకు వ్రాసిన పత్రిక, ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక, హెబ్రీయులకు వ్రాసిన పత్రిక; మరియు యాకోబు వ్రాసిన పత్రిక, పేతురు వ్రాసిన మొదటి పత్రిక, పేతురు వ్రాసిన రెండవ పత్రిక, యోహాను వ్రాసిన మొదటి పత్రిక, యోహాను వ్రాసిన రెండవ పత్రిక, యోహాను వ్రాసిన మూడవ పత్రిక, యూదా వ్రాసిన పత్రిక.

**4. అంత్యకాల ప్రవచనము** : యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము. – ఎడిటర్

# ఎపఫ్రొదితు

**(ఫిలిప్పీ 2:25-30; 4:14-19)**

ఎపఫ్రొదితు అనగా 'మనోహరము' అని అర్థము! ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 2:25-30 వరకు గల వచనములలో ఇతనిని గూర్చి చదువగలము! పౌలు ఇతనిని సహోదరుడనియు, జతపని వాడనియు, తోటి యోధుడనియు పిలిచెడివాడు. దేవుని సేవ కొరకు, దేవుని సేవకుల అవసరతల కొరకు ఇతడు ద్రవ్యమును ప్రోగుచేయువాడుగా ఉన్నాడు.

అనేకులు తమ కొరకు డబ్బును, ఆస్తిపాస్తులను ప్రోగుచేసుకొనుచున్నారు గాని; ఎపఫ్రొదితు వలె దేవుని సేవ కొరకు, ఆయన సేవకుల కొరకు ద్రవ్యమును ప్రోగుచేసి, వారికి అందించువారున్నారా? అట్లయిన ఈ పాటికి దేవుని సేవ ఎంతగానో విస్తరించి యుండును. దేవుని కొరకు ద్రవ్యమును ప్రోగుచేయువారు లేరు సరిగదా, దేవుని నామమున డబ్బు సంపాదించుకొని, స్వార్థము కొరకు వాడుకొనుట వలననే కదా దేవుని సేవ నష్టములో ఉన్నది. మరియు అట్టివారు వ్యర్థులగుచున్నారు.

ఎపఫ్రొదితు తన ప్రాణమునైనను లెక్కచేయక, క్రీస్తు యొక్క పని నిమిత్తము చావునకైనను సిద్ధపడెను (ఫిలిప్పీ 2:29-30). వ్యాధిగ్రస్థుడగునంతగా దేవుని సేవలో నిద్రాహారాలు మాని, పని చేయుచుండెను. సువార్త వ్యాపకము నిమిత్తము, పౌలు వంటి దైవజనుని ఉపచారము నిమిత్తము ఎపఫ్రొదితు తన్ను తాను సమర్పించుకొనెను.

అయితే ఈనాడు అనేకులు వెండి బంగారములను, ఆస్తి పాస్తులను సంపాదించుకొనుటకే ఎలీషా యొద్ద చేరిన గేహజీ వలె ఉన్నారు. గొప్ప దైవజనుడైన ఎలీషా యొద్ద నున్న గేహజీ; ఆత్మల భారమును, సేవా భారమును సంపాదించు కొనలేదు గాని; తన మనస్సును ధన ధాన్యములపై ఉంచినందున భ్రష్ఠుడయ్యెను.

ఆనాడు ఎలీషా తన ఆస్తిపాస్తులను వదలి వచ్చి, దైవజనుడైన ఏలీయాకు ఉపచారము చేయుచు; అతని సేవను, ఆ సేవలో ఉన్న శక్తిని గ్రహించి; ఏలీయాపై నున్న ఆత్మను రెండంతలు పొందు వరకు ఏలీయాను వదలకుండెను. ఆ తరువాత అతడు మరింత గొప్ప దైవజనుడై, గొప్ప పరిచర్య చేసెను. అలాగే ఎపఫ్రొదితు సువార్త పనిలో స్వార్థము విడిచి, ముందుకు సాగెను.

నేడు ఇటువంటి సేవకులు ఉన్నయెడల సువార్త అందని మారుమూల గ్రామములలోనికి, కొండజాతుల వారికి క్రీస్తు ప్రేమధారలు ప్రవహించి యుండవా?

కాని, నేడు అనేకులు దేవుని కంటె సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించువారుగాను, పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించనివారుగాను ఉన్నారు (II తిమోతి 3:4,5). వీరు నిర్భయముగా మీతో సుభోజనము చేయుచు, తమ్మును తాము నిర్భయముగా పోషించుకొనుచు, మీ ప్రేమవిందులలో దొంగ మెట్టలుగా ఉన్నారు (యూదా -12వ వచనం).

దేవుని సేవలో తిండిని, నిద్రను ప్రేమించువాడు తన సిలువ నెత్తుకొని ఆయనను ఎట్లు వెంబడించగలడు? స్వార్థాన్ని సిలువ వేసి, త్యాగంతో సేవ చేయువాడే ఆత్మలను సంపాదించగలడు! దేవుడే మనలను ఎపఫ్రొదితు వలె దేవుని సేవ కొరకు ద్రవ్యమును ఫ్రోగుచేయువారుగాను, క్రీస్తు కొరకు ప్రాణమును లెక్కచేయని వారుగాను చేయును గాక! - యస్. జయపాల్

**('మేము దేవుని జతపనివారము' పుస్తకము కావలసినవారు రూ. 70/- పంపి, పొందగలరు!)**

# గాలి బుడగల క్రైస్తవులు

బెలూన్ చిన్నదిగానే ఉండును గాని, అందులో గాలి ఊదేకొలది ఉబ్బును. అలాగే కొందరు పొగుడుతున్నంతసేపు ఉబ్బితబ్బిబ్బయ్యేదరు.

'అబ్బా! మీరు చాలా మంచివారండి, ఆహా! మీరు మంచి విశ్వాసులండి, కానుకలిచ్చుటలో మీరు ధారాళమైన మనస్సు కలిగినవారండి, మీ స్వరము కోకిల స్వరమండి, మీరు లేకపోతే ఏమీ జరగదండి, అబ్బా! మీలాంటి భక్తులు ఎవరూ లేరండి' అని అంటున్నంత సేపు ఎంతో ఆనందంగా అన్ని పనులు చేస్తారు, కానుక లిస్తారు, విశ్వాసులమంటారు.

అయితే కొంచెము గద్దిస్తే, బుద్ధి చెప్తే లేక తప్పు దిద్దితే వెంటనే ముడుచుకుపోతారు. గాలి బుడగలోని గాలంతా పోయినట్లుగా చప్పబడిపోతారు. 'నా కుమారుడా, యెహోవా శిక్షను తృణీకరింపవద్దు, ఆయన గద్దింపునకు విసుకవద్దు. తండ్రి తనకు ఇష్టుడైన కుమారుని గద్దించు రీతిగా యెహోవా తాను ప్రేమించు వారిని గద్దించును (సామెతలు 3:11,12) అని; "మనుష్యులందరు మిమ్మును కొనియాడునప్పుడు మీకు శ్రమ" (లూకా 6:26) అని వాక్యము చెప్పుచున్నది.

పొగిడేవాడు ఖాళీ చెంచాతో తినిపిస్తున్న వాడితో సమానమని ఒకరన్నారు. అయితే శిక్షార్థమైన గద్దింపులు జీవమార్గములు; అవి పాపపు ఊబిలో పడకుండా మనలను కాపాడును. దిద్దుబాటు నసహ్యించుకొనువాడు దరిద్రుడగును. అయితే దిద్దుబాటును అంగీకరించువాడు శ్రేష్ఠుడగును. - యస్. జయపాల్

# యేసుప్రభువు త్వరలో రానైయున్నాడు!

**"ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను. వాని వాని క్రియ చొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా యొద్ద ఉన్నది".** (ప్రకటన 22:12)

యేసు ప్రభువు తనయందు విశ్వాసముంచినవారిని తనతో తీసుకొని పోవుటకును, పాపులకు తీర్పు తీర్చుటకును; సాతానును, దాని అనుచరులను పాతాళమునకు పంపించుటకును త్వరలో రానైయున్నాడు. ఆయన వచ్చు దినమునకు అక్రమము విస్తరించుననియు, అనేకుల ప్రేమ చల్లారుననియు దేవుని వాక్యం హెచ్చరిస్తున్నది (మత్తయి 24:12).

అంతేగాక, నోవహు దినములలో వలె, లోతు దినములలో వలె ఈ అంత్య దినములు ఉండునని బైబిలు తెలియజేస్తున్నది (లూకా 17:26-29). నోవహు దినాలలో మనుష్యులు బలాత్కారముతో నిండియుండిరి (ఆదికాండము 6:11). దేవుని మరచి తినుచు, త్రాగుచు, పెండ్లాడుచు, పెండ్లికియ్యబడుచు నుండిరి. ఈ దినములలో కూడా జనులు తిండికి ఇచ్చిన ప్రాముఖ్యత దేవునికి ఇవ్వకపోవడము చూస్తున్నాము!

ఏమి తిందుమా, ఏమి త్రాగుదుమా, ఏమి ధరించుకొందుమా అనే ధ్యాసలోనే మనుష్యులున్నారు గాని; ఆహారము కంటె ప్రాణమును, వస్త్రము కంటె శరీరమును ముఖ్యమైనవని (మత్తయి 6:25); ఈ శరీర భాండములో మిక్కిలి ఐశ్వర్యమైన ఆత్మ ఉన్నదని (II కొరింథీ 4:7) గుర్తించలేకపోవుచున్నారు. అందుకే ఈనాడు పట్టణములలో ఎక్కడ చూచినా హోటల్స్, బార్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్, స్వీట్‌స్టాల్స్, రకరకాల తినుబండారాలు, షాపులు, ప్రకటనలు చూస్తున్నాము!

నోవహు దినములలో ఉన్న మరొక పాపము పెండ్లి చేసుకొనుట, పెండ్లి కియ్యబడుట! వివాహం పవిత్రమైనది! అది ఒకరి జీవితములో ఒకసారే జరుగ వలసినది. ఈనాడనేకులు పెండ్లి చేసుకొనుచూ, విడాకులు ఇచ్చుకొనుచూ, మరల పెండ్లి చేసుకొనుచూ, అనేక రకములైన అపవిత్రతలకు చోటిస్తున్నారు. ప్రేమ, పెండ్లి అంటూ అపవిత్రతను విస్తరింపజేసే సినిమాలతో, నవలలతో, పత్రికలతో ఈ లోకము నిండిపోయినది. ఈనాటి మనిషికి ముఖ్యమైన వినోదం సినిమాలు, సీరియల్స్, ఇంటర్‌నెట్ అయిపోయినవి. మరి ఇవి రాకడ సూచనలు కావా?

లోతు దినములలో కూడా జనులు తినుచు, త్రాగుచు, కొనుచు, అమ్ముచు ఉండిరి. ఈనాటి ప్రపంచంలో ముఖ్యమైన సమాచారం వ్యాపారం! వ్యాపార లావాదేవీలతో మనుష్యులు, దేశాలు కూడా నిమగ్నమై యున్నారు. వ్యాపారం చేసి లాభం

సంపాదించాలనే ఆశ ప్రతివారి హృదయంలో నాటుకుపోయింది. కాని, నేను దేవునిని ఎలా సంతోషపెట్టాలి? నా జీవము ఏపాటిది? అని గుర్తించలేకపోతున్నారు. లోతు దినములలో మనుష్యులు నారు నాటుచు, ఇండ్లు కట్టుకొనుచుండిరి. నేటి లోకంలో కూడా ఆహార ధాన్యాలను ఎరువులు వేసి ఎలా వృద్ధి చేయాలి? కోళ్ళ ఫారమ్‌ల ద్వారా కోళ్ళను, చేపల చెరువుల ద్వారా చేపలను కృత్రిమంగా వృద్ధి చేసి ఎలా వ్యాపారం చేయాలా అని ఆలోచిస్తున్నారు.

ఇక ఇల్లు కట్టుకొనే విషయం చూస్తే, కట్టడం పని జరగని వీధి గాని, ఊరు గాని ప్రస్తుత దినాలలో లేదు. ఇంటికి ఇల్లు కలుపుకొనువారికి శ్రమ (యెషయా 5:8) అని బైబిలు చెప్పుచున్నది. ఇంటి మీద ఇల్లు కట్టుచు; ఇల్లే నా స్వర్గమని, ఈ లోకమే నా స్థిర నివాసము అన్నట్లు మనుష్యులు బ్రతుకుచున్నారు. ఈనాడెక్కడ చూచినా అంతస్థు మీద అంతస్థు కట్టుచు, బాబెలు గోపురాలతో భూలోకం నింపుతున్నారు. మరి ఇక దేవుడు దిగిరాడా? (ఆదికాండము 11:1-9). మానవుడు కాంక్రీటుతో కట్టిన ఈ కట్టడాలు వ్యర్థమని నిరూపించడా?

ఇదిగో నేను త్వరగా వస్తున్నానన్న ప్రభువు త్వరలో వస్తాడు, తప్పక వస్తాడు! ప్రియ పాఠకా! మరి నీవు సిద్ధమా? యేసుక్రీస్తు రక్తములో నీ పాపాలను కడుక్కొన్నావా? నీ స్థానంలో మరణించి, తిరిగి లేచిన ప్రభువు త్వరలో రానై యున్నాడని విశ్వసిస్తున్నావా? ఆయన ఉండే చోట మనమును ఉండునట్లు ఆయన వచ్చి మనలను తీసుకొని వెళతాడని నమ్ముచున్నావా? 'నేనే మార్గము, సత్యము, జీవమునై యున్నాను; నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు చేరలేడని' ప్రభువు చెప్పిన మాట నమ్ముచున్నావా? (యోహాను 14:1-6).

ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నానన్న ప్రభువు రెండు వేల సంవత్సరములు అయిపోయినవి గాని, ఇంకా రాలేదని అనుకొనకుము. "ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరముల వలెను, వెయ్యి సంవత్సరములు ఒక దినము వలెను ఉన్నవి. కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (II పేతురు 3:8,9).

మీరు మారుమనస్సు పొందకపోతే ఆయన రాకడ సమయమున మీకు శ్రమ! "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు. ప్రతి నేత్రము ఆయనను చూచును. ఆయనను పొడిచినవారును చూచెదరు. భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు; అవును ఆమేన్" (ప్రకటన 1:7). నీవు ఆ గుంపులో ఉండక, ఆయన వచ్చునప్పుడు ఆయనతో పాటు పరలోకమునకు ఎత్తబడు పరిశుద్ధుల గుంపులో ఉండునట్లు మారుమనస్సు పొంది ప్రార్థించుము! – యన్.జయపాల్

# ఈగను వాడుకొన్న దేవుడు

ఒక చిన్న పట్టణములో గొప్ప ఉజ్జీవ ప్రసంగీకుడైన జాన్‌వెస్లీ కూటాలను నడుపుచున్నాడు. సంగీత ప్రియుడైన ఒక నాస్తికుడు ఆ కూటాలకు వెళ్లి, అక్కడ పాడే శ్రావ్యమైన సంగీతమును, పాటలను వినాలని; జాన్‌వెస్లీ ప్రసంగింప నారంభించినప్పుడు దానిని వినకూడదని నిశ్చయించుకొని ఆ కూటమునకు వెళ్లి పాటలు ముగిసే వరకు నెమ్మదిగా కూర్చొని, ఆ చక్కటి పాటలు విన్నాడు.

వర్తమానము తరువాత మరల పాటలు వినవచ్చునే ఆశతో ప్రసంగమును ప్రారంభించిన తోడనే తన రెండు చెవుల్ని మూసుకొని కూర్చున్నాడు. ఈలోగా అతని ముక్కు మీద ఒక ఈగ వ్రాలింది! దానిని తరిమివేయాలని అతడు తన తలను అటు ఇటు త్రిప్పాడు గాని, ప్రయోజనం లేకపోయింది. ఆ గిలిగింత అతనికి బహు చికాకు కలిగించినందున, చివరకు అతడు ఆ ఈగను తోలడానికి తన చెవిమీద నున్న ఒక చేతిని తీసెను.

సరిగ్గా ఆ క్షణంలో 'చెవులు గలవాడు వినును గాక' అన్న యేసు చెప్పిన మాటల్ని జాన్‌వెస్లీ చెప్పుచుండగా వినెను. ఆ మాటలకు ఆ అవిశ్వాసి బెదరిపోయి తదేకంగా విననారంభించినాడు. ఆ సువార్త సందేశం అతని హృదయాన్ని తాకినందున పశ్చాత్తాపపడి మారుమనస్సు పొందెను. హల్లెలూయ! ఒక తిరుగుబాటు పాపిని రక్షించుటకు దేవుడు ఒక ఈగను ఉపయోగించుకొనెను.

మరి నీవును దేవునిచేత వాడబడాలని ఆశ కలిగియున్నావా? నేను బలహీనుడను, విద్య లేనివాడను, జ్ఞానము లేనివాడను, సామర్థ్యము లేనివాడను, ఏమియు తెలియనివాడనని దిగులు చెందనవసరము లేదు. దేవునికి కావలసినది మన సామర్థ్యము కాదు, మన సమర్పణే! కాబట్టి సమర్పించుకో, ఆయన నిన్నును వాడుకొనును!


## కల్వరి ప్రేమధార పాఠకులకు విజ్ఞప్తి!

గత 35 సంవత్సరాలుగా ప్రచురించబడుతున్న ఈ పత్రికను కొనసాగించుటకు మీ ప్రార్థనా సహకారాలు అవసరం! మీరు ఈ పత్రిక వార్షిక చందా చెల్లించారా? లేనట్లైతే మీ వార్షిక చందా, విరాళములను పంపి, సహకరించండి! ఇప్పుడు పోస్టాఫీసులకు, బ్యాంక్‌లకు వెళ్ళవలసిన అవసరము లేకుండా, ప్రక్కన ఇవ్వబడిన నంబర్‌కు Google Pay మరియు Phonepe ద్వారా కూడా మీ వార్షిక విరాళమును, కానుకలను పంపించవచ్చు!

**Google Pay & Phonepe**
**JAYAPAUL N**
**+91 9100 100 888**

బైబిలులోని పదాలకు

# అర్థాలు తెలుసుకొందాం!

(గత సంచిక తరువాయి...)

| | | | |
|---|---|---|---|
| 546. | ఏలీము | = ఈతచెట్లు | (నిర్గమ 15:27; సంఖ్యా 33:8) |
| 547. | ఏలీయా | = యెహోవా నా దేవుడు | (I రాజులు 17:1; ఎజ్రా 10:21) |
| 548. | ఏలీయాబు | = నా దేవుడు తండ్రి | (సంఖ్యా 1:9; I సమూయేలు 16:6) |
| 549. | ఏలీయాము | = దేవుడు ఆ కుటుంబములో చేరినవాడు | (II సమూయేలు 11:3) |
| 550. | ఏలీయ్యా | = నా దేవుడు యెహోవా | (I దిన 8:26; ఎజ్రా 10:26) |
| 551. | ఏలీషూవ | = దేవుడు రక్షించును, దేవుడు ఐశ్వర్యవంతుడు | (I దిన 14:5) |
| 552. | ఏలీసూరు | = నా దేవుడు బండయై యున్నాడు | (సంఖ్యా 1:5; 2:10) |
| 553. | ఏలూలు | = అభావత్వము, చేలను ఏరుకొను నెల | (నెహెమ్యా 6:15) |
| 554. | ఏలోను | = సింధూర వృక్షము | (ఆది 26:34; న్యాయాధి 12:11) |
| 555. | ఏశావు | = రోమము గలవాడు | (ఆది 25:25; యెహోషువ 24:4) |
| 556. | ఏశెకు | = జగడము, కలహము | (ఆది 26:20) |
| 557. | ఏషెకు | = హింస, బలాత్కారము | (I దిన 8:39) |
| 558. | ఏసర్హద్దోను | = జయశాలి | (II రాజులు 19:37) |
| 559. | ఏసెరు | = ధననిధి, సహాయుడు | (ఆది 36:21; I దిన 1:38) |
| 560. | ఏసెలు | = ఎడబాపు, నిర్గమము | (I సమూయేలు 20:19) |
| 561. | ఏఫ్రోను | = బలమైనది | (యెహోషువ 15:9) |
| 562. | ఏహీ/ ఏహూదు | = నా సహోదరుడు, ఐక్యత | (ఆది 46:21; I దిన 8:6) |
| 563. | ఐగుప్తు | = రెండు ఇరుకు మార్గములు, రెండంతల యిబ్బంది | (ఆది 12:10) |
| 564. | ఐతుకు | = అదృష్టవంతుడు | (అపొ. కార్య. 20:9) |
| 565. | ఐనెయ | = స్తుతి | (అపొ. కార్య. 9:33,34) |
| 566. | ఐనోను | = ఊటలు | (యోహాను 3:23) |
| 567. | ఒక్రాను | = బాధపరచువాడు, బాధపడువాడు | (సంఖ్యా 1:13; 2:27) |
| 568. | ఒత్ని | = సమయోచితమైన మాటలు | (I దిన 26:7) |
| 569. | ఒత్నీయేలు | = దేవుని సింహము | (యెహో 15:17; న్యాయాధి 1:13) |
| 570. | ఒనేసిఫోరు | = లాభము కలుగజేయువాడు | (II తిమోతి 1:16; 4:19) |
| 571. | ఒనేసిము | = ప్రయోజనకరమైనవాడు | (కొలొస్స 4:8-9; ఫిలేమోను 1:10) |
| 572. | ఒప్ని | = ఉన్నత స్థలము, ఎగురుట | (యెహోషువ 18:23-26) |
| 573. | ఒఫ్రా | = జింకపిల్ల రంగు, దుమ్ము రంగు, జింక | (యెహో 18:22) |
| 574. | ఒమ్రీ | = యెహోవా దాసుడు | (I రాజులు 16:16; I దిన 7:8) |
| 575. | ఒలుంపా | = పరలోక సంబంధి | (రోమా 16:15) |

**(సశేషం)** - ఎడిటర్

# మనం ఎలా ప్రార్థించాలి?

మనం చేసే ప్రార్థనల్లో చాలావరకు స్వలాభాపేక్ష తొంగి చూస్తుంటుంది. అందుచేతనే అవి శక్తిరాహిత్యంగా ఉంటూ, ఆశించిన ఫలాన్ని సాధించిపెట్టలేక పోతున్నాయి. ప్రార్థనలో వేటిని మనం యాచిస్తామో, వాటిలో రవ్వంతైనా లోపం లేదు. పైపెచ్చు దేవుని దృష్టిలో కూడా అవి ఎంతో ప్రీతిపాత్రమైనవే! మరలాంటప్పుడు వచ్చిన చిక్కేమిటి? ఎందుకు దేవుడు అడిగిందే తడవుగా అనుగ్రహించలేకపోతున్నాడు.

ఎందుచేతనంటే, ప్రార్థనకు వచ్చే జవాబులో దేవుడే స్తుతి, ప్రశంస పొందాలని మనం గాఢంగా వాంఛించడం లేదు. ఆ జవాబేదో మనకు సుఖాన్ని, సంతోషాన్ని తెచ్చిపెట్టాలని కోరుకుంటాం! గనుకనే దేవుని ప్రమేయం లేకుండా, తమ స్వంత సుఖశాంతుల కోసం ప్రార్థించే వ్యక్తులు ఫలితం పొందక; నిరాశా నిస్పృహలకు గురవుతున్నారు.

ఉదాహరణకు కొందరు సోదరీమణులు తమ భర్తలు పరివర్తన చెందాలని ఎడతెగక ప్రార్థిస్తూ యుంటారు. అలా వారు చేయడం అన్నివిధాలా సముచితమే! కాని వారి ప్రార్థన వెనుక దాగియున్న స్వార్థచింతన దేవునికి అసహ్యం కలిగిస్తుంది. వారి కాంక్షంతా తమ భర్తల మనసులు మారితే, వారి దురభ్యాసాలు మానివేస్తారని; భేదాభిప్రాయాలతో సతమతమౌతున్న తమ కుటుంబ జీవనం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా నింపాదిగా, నిశ్చింతగా సాగిపోతుందని!

అందుచేతనే వారి ప్రార్థనకు జవాబు లభించడం లేదు. దానికి బదులు తన భర్త నరకానికి ఉరకలేస్తున్నాడని; తన ముందరే యేసుక్రీస్తు రక్తాన్ని, ఆయన ప్రేమను తృణీకరిస్తూ దేవుని నామాన్ని ఘనహీనం చేస్తున్నాడనే భారంతో, బాధతో ఓ భార్య ప్రార్థించినప్పుడు దేవుడు తప్పక ఆలకిస్తాడు, జవాబిస్తాడు.

అలాగే మరికొందరు పరిశుద్ధాత్మ నింపుదల కోసం నిరంతరం ప్రార్థిస్తుంటారు. కాని అందులో కృతార్థులు మాత్రం కాలేకపోతున్నారు. లేఖనపరంగా చెప్పుకోవాలంటే పరిశుద్ధాత్మను అనుగ్రహించడం పరలోక తండ్రి అభీష్టమే (లూకా 11:13). కాని ఎందుచేతనో దేవుడు తన వాగ్దానాన్ని వీరి విషయంలో నెరవేర్చలేకపోతున్నాడు. పతన జీవితాలు పునర్నిర్మించుకొనేందుకు కాక; క్రైస్తవ బోధకులుగా ఎక్కువ శక్తిని పొంది, ఎక్కువ సేవ చేసి, తద్వారా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలనే స్వప్రయోజనార్థం కోసమే వీరు ప్రార్థన చేస్తారు.

అసలు మనం పరిశుద్ధాత్మ పూర్ణత కోసం ఎందుకు ప్రార్థించాలి? ఎందుకంటే అథమ స్థాయి క్రైస్తవ జీవితాల ద్వారా, శక్తిరహితమైన దైవసేవ ద్వారా సకల సృష్టికర్తయైన దేవుడు అపఖ్యాతి పాలు కాకూడదని! అంతేకాదు, మనం పొందిన నూతనత్వం, శక్తి సంపద కారణంగా దేవుడు మహిమను పొందాలని! మనము ఇటువంటి ఆశతో ప్రార్థిస్తే ప్రభువు తప్పక జవాబిస్తాడు. కాబట్టి మనం ఇందుకే ప్రార్థించాలి!

– ఆర్.ఏ. టోరీ

# మార్టిన్ లూథర్

**(1483-1546)**



మార్టిన్ 1483 నవంబరు 10న జర్మనీ దేశములోని 'ఎలిసిసిబెన్' అను స్థలములో హాన్స్ లూథర్, మార్గరెట్ అను సామాన్య దంపతులకు జన్మించెను. తన 13వ సంవత్సరమున హైస్కూలులో ప్రవేశించెను. 17 సంవత్సరముల వయస్సులో 'ఎర్‌ఫర్ట్' యూనివర్సిటీలో చేరెను. ఈయన 'లా' చదువుచుండగా, 1505వ సంవత్సరంలో భయంకరమైన వడగండ్ల తుఫానులో చిక్కుకొని; చనిపోబోయే సమయంలో 'ప్రభువా, నన్ను రక్షించు, నేను మఠంలో (పరిశుద్ధుల శిబిరంలో) చేరతాను' అని ఒప్పుకొనెను. ఆ తుఫాను నుండి రక్షించబడి, తాను చేసిన మ్రొక్కుబడిని నిలబెట్టుకొనుటకు జర్మనీలోని మఠంలో చేరగోరెను.

మార్టిన్ తల్లి తన కుమారుడు లాయర్ కావలెనని కోరెను. కాని మార్టిన్ తాను మ్రొక్కుబడి చేసుకొన్న ప్రకారము కేథలిక్ మతగురువు కాగోరెను. లూథర్ ఎక్కువగా ప్రార్థించుచు, సామాన్యమైన వస్త్రములు ధరించుచు, మంచివాడిలా ఉండాలని ప్రయత్నించుచుండెను. దేవుడు ఉగ్రుడని, అతి పవిత్రుడని, పాపాలను సహించలేడని భావించిన లూథర్; తన పాపములకు ప్రాయశ్చిత్తముగా శరీరమును నలుగగొట్టుకొనుచు, ఎలాగోలా పరలోకమునకు చేరుకోవాలనుకొనుచుండెను.

సున్నితమైన మనస్సాక్షి గలవాడై, లోతైన పాపపు ఒప్పుకోలు కలిగి సమాధానం కోసం ఆశిస్తుండేవాడు. సంఘ ఆచారాల ప్రకారం పాప క్షమాపణ పొందుటకు అన్ని ప్రయత్నములను చేసెను. పాపపు ఒప్పుకోలు ప్రార్థనలు చేయుట, తన్ను తాను దుఃఖపరచుకొనుటయే గాక, రోమాకు యాత్రకు కూడా వెళ్ళి వచ్చెను. కాని ప్రయోజనం లేక, స్వనీతి ద్వారా పాపముల నుండి విడుదల పొందుట సాధ్యము కాదని తెలుసుకొనెను.

మార్టిన్ విటన్‌బర్గ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ; గ్రీకు, హెబ్రీ భాషలను బాగుగా పఠించెను. ఒక సహోదరుని సలహాతో ఆ దినములలో నిషేధించ బడిన బైబిలు గ్రంథాన్ని బాగుగా చదివి, ధ్యానించుట మొదలుపెట్టెను. ఆలాగు 1515వ సంవత్సరంలో గ్రీకు, హెబ్రీ భాషలలో ఉన్న రోమా పత్రికను చదువు చుండగా 'నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించును' అనే మాట లూథర్ జీవిత గమనాన్నే మార్చెను. సువార్తను గ్రహించిన లూథర్ రక్షణ కృప మూలముగానే గాని, క్రియల వలన కాదని గ్రహించెను. కృప మేరకు ఆత్మ రక్షణ, సమాధానమును పొందెను.

ఆ దినములలో ఉన్న రోమన్ కేథలిక్ సంఘ దురాచారములను ఎదిరించెను. పాప పరిహార పత్రములను అమ్ముట, రుసుము చెల్లించుట ద్వారా నరకంలో ఉన్న ఆత్మలు పరలోకమునకు వెళతారు అనుట తప్పని ఖండించెను. ఫర్గెటరీలో ఉన్న ఆత్మలను పరలోకమునకు పంపించుటకు పోప్‌కు గాని, మరి ఏ మానవునికి గాని అధికారము లేదని వక్కాణించెను. యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారానే మన పాపములు క్షమించబడగలవు, పరలోకమునకు వెళ్ళగలము అనే సత్యాలను ధైర్యముగా ప్రకటించెను.

నిజముగా పశ్చాత్తాపపడు ప్రతివానికి పాప క్షమాపణ, పాపపు డాగు నుండి క్రీస్తులో సంపూర్ణ విమోచన కలుగునని; దానికి మనుష్యులిచ్చే పాప నివారణ పత్రములు అవసరము లేదని ప్రకటించెను. పోప్ అధికారము, పాప క్షమాపణ పత్రికలు వాక్యానుసారమైనవి కావని, ప్రార్థన ద్వారానే సంఘము మరల కట్టబడాలని ప్రతివానికి అర్థమయ్యేలా తాను వ్రాసిన 95 పరిశోధనా పత్రములను 1517వ సంవత్సరములో జర్మనీలోని 'విటన్‌బర్గ్' ఆలయ ద్వార బంధములకు మేకులతో కొట్టెను.

మొదట పోప్ ఈ విషయములను అంతగా పట్టించుకోలేదు గాని, తరువాత వాటి తీవ్రతను గ్రహించి, లూథర్‌ను హెచ్చరించి, తాను వ్రాసినవన్నీ తప్పని ఒప్పుకొనమనెను. లూథర్ నిరాకరించగా, 1520వ సంవత్సరము జూన్ 15న లూథర్‌ను వెలివేసి, అతడు వ్రాసిన వ్రాతలను కాల్చివేయమని ఆజ్ఞ ఇచ్చెను. లూథర్ బహిరంగముగా పోప్ ఇచ్చిన ఆజ్ఞ పత్రాలను, కాథలిక్ కాగితములను కాల్చివేసెను.

లూథర్ గుర్తించదగిన ధైర్య సాహసములు గలవాడు. అతని శత్రువులు అతనిని వార్మ్స్ (Warms) అనే స్థలంలో కలుసుకొమ్మని పిలిచినప్పుడు, అతని స్నేహితులు ఆటంకపరచినను అతడు, 'ఆ పట్టణములోని ఇండ్ల మీదనున్న పెంకులన్ని దెయ్యములున్నను నేను పోయెదను' అనెను. ధైర్యముగా అక్కడ తాను వ్రాసిన పత్రాలు వాక్యానుసారమని, వాటిని నిరాకరించుటకు కుదరదని చెప్పెను.

అయితే అతడు తిరిగి వెళ్ళుచుండగా అతని స్నేహితులే అతనిని బంధించి, వార్ట్‌బర్గ్ (Wart-Burg) అనే స్థలంలో ఒక సంవత్సరం పాటు అతనిని దాచిరి. అతని శత్రువులు లూథర్ చనిపోయెనని తలంచిరి. కాని లూథర్ ఆ సంవత్సరంలో క్రొత్త నిబంధనను జర్మనీ భాషలోనికి తర్జుమా చేయుటలో నిమగ్నుడయ్యెను. 1522 మార్చిలో అతడు బయటపడిన తరువాత మరలా విటన్‌బర్గ్‌కి వచ్చి ప్రసంగించుటలోను, వ్రాయుటలోను గడిపెను.

1524లో తాను వ్రాసిన 23 పాటలను ఒక కీర్తన పుస్తకముగా ప్రచురించెను. ప్రతి జర్మనీ దేశస్థుడు చదువునట్లు పూర్తి బైబిలును అతి ప్రయాసతో జర్మనీ భాషలోనికి తర్జుమా చేసెను గాని, హెబ్రీ భాషలో ఉన్న పాత నిబంధనను తర్జుమా చేయుటకు

12 సంవత్సరములు పట్టెను. ఆలాగు 1534వ సంవత్సరమున పాత నిబంధనను కూడా జర్మనీ భాషలోనికి తర్జుమా చేసెను. ఆ మొత్తం బైబిలును జర్మనీ భాషలోనికి అనువదించినవాడు మార్టిన్ లూథర్! 'దైవ వాక్యాన్ని చేతబట్టిన సామాన్య మానవుడు, దైవ వాక్యం లేని మహా బలవంతుడైన పోప్ కన్న అత్యంత బలవంతుడు' అని చెప్పడమే కాదు, తన జీవితము ద్వారా నెరవేర్చి చూపించాడు.

ఒక ఆదివారము క్యాజిల్ చర్చిలో మార్టిన్ ప్రసంగించుచు, ఒక కథ చెప్పెను. 'ఒక వ్యక్తి మరణించిన తరువాత తనతో పాటు తన ఆత్మను తప్ప మరి దేనినీ తీసుకొనిపోడు' అని చెప్పుటకు ఉదాహరణగా ఈ కథ చెప్పెను. దాని ప్రకారము, ఒకడు మరణించి తనతో పాటు పాప క్షమాపణ పత్రమును తీసుకొని వెళ్ళి, నరక ద్వారము నొద్దనున్న దయ్యముతో 'ఇది నా పాప క్షమాపణ పత్రము, పరలోకములో ప్రవేశించుటకు నా టిక్కెట్టు ఇది. కాని పొరపాటున నేను ఇచ్చటికి పంపించబడితిని' అని చెప్పుచుండగా; ఆ నరకాగ్ని వేడికి సీలు కరిగిపోయినది. ఆ పత్రము కూడా కాలి బూడిదైపోయినది. 'ఆ పత్రం పనికిరాదు, బూడిదైపోయింది' అని చెప్పుచూ, దయ్యం అతనిని నరకములోనికి నెట్టినది.

లూథర్ కేథలిక్ సంఘాన్ని సంస్కరించగోరెను గాని, కేథలిక్ సంఘము అతనిని బహిష్కరించెను. లూథర్ తన జీవిత కాలమంతా సంఘ పునరుద్ధరణకు ప్రయాసపడెను. ఎన్నో శ్రమలను, కష్టములను ఎదుర్కొనవలసి వచ్చెను. దేవుని వాక్యమునకు విరోధులైన వారి వలన మాత్రమే కాక, తన సొంత స్నేహితుల ద్వారా కూడా మోసగించబడెను. అయినను ప్రభువు కృప వలన దేవుడు తనకిచ్చిన ప్రత్యక్షతను బయలుపరచెను.

తన తండ్రి యొక్క సలహా మేరకు లూథర్ తన 42వ యేట, 24 యేండ్ల 'క్యాథరిన్ ఫాన్ బోరా'ను 1525లో వివాహము చేసుకొనెను. వారికి ఆరుగురు సంతానము కలిగిరి. వారిలో నలుగురు మాత్రము బ్రతికిరి. వారిని చిన్న వయస్సు నుండి ఎంతో భయభక్తులతో పెంచెను. 'ఒక చిన్న బిడ్డ చనిపోయినా ఫరవాలేదు గాని; అవిధేయుడుగాను, భక్తిహీనుడుగాను ఒకడు నా ఇంట్లో పెరుగుట నాకిష్టం లేదు' అని చెప్పెడివాడు.

బైబిలును వెలుగులోనికి తెచ్చి, సర్వలోకమునకు తెలియజేయుటకు దేవుడు వాడుకొన్న పనిముట్టు డాక్టర్ మార్టిన్ లూథర్. ఇతడు వృద్ధాప్యము సమీపిస్తున్నప్పటికి, ఆరోగ్యము క్షీణిస్తున్నప్పటికి తన పనిని కొనసాగిస్తూ యుండెను. వాక్య పఠనము, రచనలు, ప్రసంగములు, వ్యక్తిగత సేవ, ప్రార్థన, ప్రయాణములు ఈయన సేవలోని భాగములు! ఈయన 1546 ఫిబ్రవరి 18న తన 62వ సంవత్సరములో తెల్లవారు జాము 3 గంటలకు గుండెపోటుతో మరణించి, ప్రభువు సన్నిధికి ఏగెను.

లూథర్ మరణించినప్పుడు అతని గురించి ఫిలిప్ మెలాంగ్తన్ ఇలా అన్నాడు – 'లూథర్ ముఖ్యమైన, సత్యమైన, అవసరమైన క్రైస్తవ సిద్ధాంతాన్ని వెలుగులోకి తీసుకొని వచ్చాడు. నిజమైన పశ్చాత్తాపమంటే ఏంటి? అన్న విషయాన్ని, దేవుని న్యాయమైన తీర్పును ఎదుర్కోలేక వణుకుచున్న పాపికి క్రీస్తులో ఆశ్రయముందన్న సంగతిని వాక్యము నుండి చూసాడు. మనిషి విశ్వాసం ద్వారా నీతిమంతునిగా తీర్పు తీర్చబడతాడు అనే పౌలు బోధను అందరికీ అర్థమయ్యేలా వివరించాడు'.

మార్టిన్ లూథర్ సంఘ కాపరి, ప్రొఫెసర్, మత సంస్కర్త, తండ్రి, గ్రంథకర్త, గీతకర్త, అనువాదకుడు, విశ్వాసము ద్వారా జయమును అనుభవించినవాడు. తన పనిని ముగించి, తనను ప్రేమించిన ప్రభువు యొద్దకు చేరెను. 'నా పేరు విడిచిపెట్టుడి, మిమ్మును 'లూథరన్‌లు' అని కాదు, క్రైస్తవులు అని పిలిపించుకొనుడి' అని తనను వెంబడించిన వారిని బ్రతిమాలుకొన్న దీనుడు. క్రైస్తవ ప్రపంచం అతనిని జ్ఞాపకముంచుకొనక తప్పదు!

– యస్. జయపాల్


# సోషల్ మీడియాలో

## Dr. Jayapaul You Tube ఛానల్

## Subscribe చేసారా? లేనిచో ఇప్పుడే చేయండి!

You Tube

**LIVEలో ప్రతిరోజు తప్పక వీక్షించండి!**

- ★ 'అనుదిన ధ్యానం' ఉదయం 7:00 గం॥లకు!
- ★ 'హెచ్చరిక' మధ్యాహ్నం 3:00 గం॥లకు!
- ★ 'కల్వరి ప్రతిధ్వని' రాత్రి 9:00 గం॥లకు!
- ★ 'మన్నా మనకు' అర్థరాత్రి 12:00 గం॥లకు!

facebook

twitter

Instagram

**అలాగే లైవ్ ప్రోగ్రామ్స్, ప్రతి ఆదివారం ఆరాధనలు మరియు గెట్-టుగెదర్‌లు మరనేక కార్యక్రమాలు వీక్షించండి!**

Dr. Jayapaul You Tube **ఛానల్‌ను మరియు** facebook, twitter, Instagram **లలో ఇప్పుడే** Subscribe **చేయండి!** Like **చేయండి!** Share **చేయండి!**

# వధువు సంఘము

ఓ యువరాజు తన స్వయంవరాన్ని ప్రకటన చేయించాడు. రాణిని అవ్వాలనే ఆశతో ఎంతోమంది అందమైన యువతులు చక్కగా అలంకరించుకొని, రాజ దర్బారుకు బయలుదేరారు! ఇంతలో దారి ప్రక్కనే ముళ్ళపొదల్లో చిక్కుకొన్న ఓ గొఱ్ఱెపిల్ల అరుపు వీరందరి దృష్టిని ఆకట్టుకొంది. ఆ గొఱ్ఱెపిల్ల ఉన్న స్థితిని చూచి విడిపించాలని అందరికీ ఆశ కలిగింది గాని; తమ అలంకరణ పాడైపోవునేమోనని, ఆలస్యమైపోతుందేమోనని, ముళ్ళు గుచ్చుకొని గాయాలవుతాయేమోనని మరి ముఖ్యంగా ఇంతలోకే రాజ కుమారుడు వచ్చి వెళ్ళిపోతాడేమోననే భయంతో ఎవరును ఆ పని చేయుటకు తెగించలేదు.

అయితే వారిలో ఒక యువతి తన అలంకరణ చెరిగిపోయినా ఫరవాలేదు, తనకు గాయాలైనా ఫరవాలేదు గాని; ముళ్ళపొదల్లో చిక్కుకొన్న ఆ అమాయకపు గొఱ్ఱెపిల్లను తప్పించితే చాలని అనుకొని వెంటనే ఆ ముళ్ళపొదలో దూరి, అతి కష్టంతో ఆ గొఱ్ఱెపిల్లను బయటికి తెచ్చింది. ఒళ్ళంతా చీరుకుపోయి, రక్తము కారుచున్నను ఎలాగో పరుగెడుతూ స్వయంవరానికి చేరుకొంది. అయితే యువరాజు ప్రేమ, జాలి కలిగి; ఏదీ లెక్క చేయకుండా, నశించిపోతున్న దానిని రక్షించిన ఆమె మెడలో హారము వేసి తనకు రాణినిగా స్వీకరించెను.

వధువు సంఘము తన అలంకరణతో మురిసికొనేది కాదు గాని, నశిస్తున్న ఆత్మలను రక్షించడంలో నలుగుతున్నదే! "అగ్నిలో నుండి లాగినట్లు కొందరిని రక్షించుడి, శరీర సంబంధమైన వారి అపవిత్ర ప్రవర్తనకు ఏ మాత్రము నొప్పుకొనక దానిని అసహ్యించుకొనుచు భయముతో కొందరిని కరుణించుడి" (యూదా :23).

– యన్. జయపాల్

## మీరు చదివారా?

Dr.N. జయపాల్ గారు తన 50 సంవత్సరముల సేవా జీవితములో బైబిలు పఠనము ద్వారా, ధ్యానించుట ద్వారా, పొందిన అనుభవాల ద్వారా వ్రాసిన 50 పుస్తకములు మీ బైబిలు పఠనమునకు, విశ్వాస జీవితమునకు, పరిచర్యకు ఎంతో సహకరించును. ఈ 50 పుస్తకములు పొందగోరువారు కేవలం రూ. 3,000/- M.O., D.D. లేదా Online Transfer ద్వారా పంపండి! మీ చిరునామా మరియు మీరు పంపిన రుసము, రసీదు వివరాలతో సహా 89 39 39 39 39 నంబర్‌కు పంపినచో, రిజిస్టర్డ్ పోస్ట్‌లో ఈ పుస్తకాలన్నీ మీకు పంపెదము!

**మా చిరునామా : Dr. N. JAYAPAUL, 29, New Colony Road, Velachery, Chennai - 600 042.** **వివరములకు : (0) 8939393939**

# ఆయన చేసిన ఉపకారములు మరువకుము!

శత్రువుల చేతిలో పట్టుబడిన ఒక రాకుమారుని మేడపై బంధించిరి. ఎలాగోలా బయటపడాలని ప్రయత్నిస్తున్న రాకుమారుడు క్రిందికి తొంగి చూచి, ఒక వ్యక్తిని కనుగొనెను. ఆ వ్యక్తి దృష్టిని పైకి మళ్ళించాలనే ప్రయాసతో అనేక సైగలు చేసెను. గాని ఎటువంటి ప్రయోజనము లేక, చివరికి అతి విలువైన వజ్రములతో పొదగబడి యున్న తన చేతి కడియమును తీసి క్రింద పడవేసెను. అది చూచిన ఆ వ్యక్తి త్వరత్వరగా దానిని తీసుకొని తన జేబులో వేసుకొని, ఇంకా ఏమైనా దొరుకునేమోనని క్రింద వెదకుట ప్రారంభించెను. గాని అది ఎక్కడ నుండి వచ్చినదాయని తన దృష్టిని పైకి మళ్ళించడాయెను.

'ఓ బాబూ! అదిచ్చింది నేను, నా వైపు చూడు' అన్నట్లు సైగలు చేస్తూ, మేడపై నిలబడియున్న ఆ రాకుమారుని వైపు చూడడాయెను. ఏదోవిధంగా అతనిని పైకి చూచేలా ఆ రాకుమారుడు తన రెండవ చేతి కడియాన్ని కూడా తీసి క్రింద పడవేసెను. క్రింద ఉన్న వ్యక్తి దానిని కూడా తీసుకొని మరో జేబులో పెట్టుకొని, ఇంకనూ ఏమైనా దొరుకునేమోనని క్రిందనే వెదకుచుండెను. గాని తనకింత విలువైన కడియములిచ్చిన ఆ రాకుమారుని వైపు పైకి చూడలేదు.

విసుగు చెందిన ఆ రాకుమారుడు చేతికందిన ఒక రాయిని తీసుకొని, అతనిపై విసిరెను. ఠపీమని తలకు రాయి దెబ్బ తగలగానే "అబ్బా" అంటూ పైకి చూసెను క్రింద ఉన్న ఆ వ్యక్తి! నేడు అనేకులు దేవుడిచ్చు అనేకాశీర్వాదములు పొందుచు, ఆయనకు కృతజ్ఞతా స్తుతులను చెల్లించక; వారి బలాన్ని, సమయాన్ని, సామర్థ్యాన్ని భూసంబంధమైన వాటిని ప్రోగుచేసుకొనుటకే వాడుచున్నారు గాని, పరము నుండి ఆశీర్వదించు ఆ ప్రభువు వైపు చూడరైరి.

దేవుడు చేసిన మేళ్ళను మరచి గర్వాంధులు, మూర్ఖులు అగుచున్నారు. గాని ఆకాశము వైపు కన్నులెత్తి, ఆయనకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుట లేదు. దేవుడొక్క దెబ్బ కొట్టినప్పుడు అనగా శ్రమలు, కష్టములు, వ్యాధులు వచ్చినప్పుడు 'ప్రభువా!' అంటూ దేవునికి మొరపెడుతున్నారు. అయితే మనము దేవుడు చేసిన మేళ్ళను మరువక కృతజ్ఞత కలిగి, ఆయనను స్తుతిస్తూ, ఆయన దెబ్బలు తప్పించుకొందుము గాక! "నిత్యము తిరుగుబాటు చేయుచు మీరేల ఇంకను కొట్టబడుదురు?" (యెషయా 1:5). గనుక ప్రభువు చేయుచున్న మేళ్ళకై ఆయనకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుదము. "నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము, ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము" (కీర్తన 103:2). – యన్. జయపాల్

## 'కల్వరి దర్శనం' టి.వి. పరిచర్యలో పాలిభాగస్థులవ్వండి!

తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ మరియు ఒరియా భాషలలో టి.వి. కార్యక్రమాలు ప్రసారమవుచున్నవి. ఈ పరిచర్యలన్నీ కొనసాగించుట భార భరితముగా ఉన్నది. ప్రార్థించండి! ఎంతో ఖర్చుతో, ప్రయాసతో జరుగుచున్న ఇట్టి భారభరితమైన పరిచర్యలో మీరు కూడా పాలిభాగస్థులగునట్లు **రూ. 1,000/-** లేక **రూ. 10,000/-** లేక ప్రభువు మిమ్మును ప్రేరేపించిన కొలది మీ విరాళములను, కానుకలను పంపి, దైవాశీస్సులు పొందండి!

M.O. లు, D.D. లు, చెక్కుల ద్వారా లేక **ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉన్న** Online Transaction **ద్వారా మీ విరాళములు పంపించవచ్చు!** మీరు విరాళము పంపిన తరువాత ఫోన్ ద్వారా లేక SMS ద్వారా లేక Whatsapp ద్వారా మాకు తెలియజేయండి!

## QR కోడ్ ద్వారా కానుకలు, విరాళములు

ఇప్పుడు JAYAPAULFOUNDATIONS అకౌంట్‌కు ప్రక్కనున్న QR కోడ్ ద్వారా కూడా మీ కానుకలు, విరాళములు పంపవచ్చు! (దయచేసి ఈ QR కోడ్‌ను స్కాన్ చేయండి!)

### మరియు అకౌంట్ వివరములు

**ICICI Bank Current A/c No: 021205006901**
**I.F.S. Code : ICIC0000212,**
**Branch: Santhome, Chennai-4.**

**ONLINE వివరములు : Account Name: JAYAPAUL FOUNDATIONS**

**State Bank of India S.B. A/c No: 30699437837**
**I.F.S. Code : SBIN0001444,**
**Branch: Kodambakkam, Chennai-24.**

**Andhra Bank Current A/c No: 207211100000229**
**I.F.S. Code : ANDB0002072**
**Branch : Kodambakkam, Chennai-24.**

మీరు విరాళము పంపు విషయములో వివరములకై **(0) 89 39 39 39 39** నంబర్‌కు ఫోన్ చేయండి! లేక మీ పేరు, సెల్ నంబర్, విషయము ఈ సెల్ నంబర్‌కు SMS చేయండి!

**T.V. పరిచర్యకు మీ విరాళములు పంపుటకు మా చిరునామా :**

**JAYAPAUL FOUNDATIONS,**
**29, NEW COLONY ROAD,**
**VELACHERY, CHENNAI-600042.**

*Published and Edited by* : **N. JAYAPAUL,** 105, Ramanayakan Street, Nungambakkam, Chennai - 600 034. Printed by : R. Veera Raghavulu at Padmalaya Printers, 8/17, Manali Road, Chennai - 600 021. *Editor* : **N. Jayapaul**

# కల్వరి దర్శనం టీవీ కార్యక్రమములు

**Maa Movies** — Telugu
Everyday (06:30 am)

**Subhavaaratha TV** — Telugu
Everyday (07:00 pm)

**Aradana TV** — Telugu
Everyday (08:00 pm)

**Shubhasandesh TV** — Hindi
Monday-Saturday (07:30 pm)

**Nambikkai TV** — Tamil
Monday-Friday (07:30 pm)

**Tamilan TV** — Tamil
Saturday (07:30 pm)

**Harvest TV** — Malayalam
Monday (03:00 pm)

**Powervison TV** — Malayalam
Friday-Saturday (12:30 pm)

**Zee Bangla** — Bengali
Every Friday (06:30 am)

**Prarthana TV** — Oriya
Saturday-Sunday (04 :00 pm)

దేవుని కృప వలన అనేక ఛానెల్స్‌లో, అనేక భాషల్లో కల్వరి దర్శనం కార్యక్రమములు ప్రసారమవుచున్నవి.
మీరును వీక్షించండి, మీ సహకారాన్ని అందించండి, ఈ పరిచర్యలో పాలిభాగస్థులవ్వండి!
బ్యాంకు వివరములు కొరకు ప్రక్క పేజీ చూడండి లేక 0 89 39 39 39 39 కు ఫోన్ చేయండి.


Follow Our Social Media Pages
SUBSCRIBE - LIKE - SHARE
DR JAYAPAUL
YouTube
Subscribe for daily updates
• Manna Manaku,
• Live streams,
• Anudhina Dhyanam,
• HECHARIKA,
• Calvary Prathidwani
SUBSCRIBE
Dr.Jayapaul
The Calvary Church
facebook.
Follow us on Facebook
To receive updates about our ministry
FOLLOW US
Facebook/DrJayapaul
N Joseph Prakash
N Michael Paul
Raj Prakash Paul
Instagram
Follow us on Instagram
For Highlights of our events
Instagram/DrJayapaul
WhatsApp
Whatsapp
9884807779
For Prayer Call
9884707779
For Enquires
8939393939